జర్నలిస్ట్ డైరీ

తెలుగు దినపత్రిక

సంపుటి: 12 | సంచిక: 190 | మంగళవారం | 10-02-2026 | పేజీలు: 08 | వెల రూ. 3 | www.epaperjournalistdiary.com

ఘనంగా ఎర్రచీర థ్యాంక్స్ మీట్, యాక్టింగ్ క్వీన్ కారుణ్య చౌదరి బర్త్ డే సెలబ్రేషన్స్

08

రాష్ట్రానికి పట్టిన దరిద్రం బీఆర్ఎస్

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోపణ
- మున్సిపల్ ఎన్నికల్లో త్రిముఖ పోటీ

02

మధిర రూపు రేఖలు మారుస్తా

- మధిర రోడ్ షోలో భట్టి విక్రమార్క

జర్నలిస్ట్ డైరీ,మధిర:

మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మధిర పట్టణంలో నిర్వహించిన భారీ రోడ్ షోలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మధిర పట్టణ అభివృద్ధిపై కీలక వ్యాఖ్యలు చేశారు. గత పది సంవత్సరాలుగా మధిర మున్సిపాలిటీలో ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరగలేదన్నారు. ప్రజల ఆశీస్సులు, సహకారంతో మధిర మున్సిపాలిటీలోని అన్ని వార్డులను కైవసం చేసుకుంటామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

మధిర పట్టణ రూపురేఖలను పూర్తిగా మార్చే బాధ్యత తనదేనని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు. మధిరలో అండర్ డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేస్తామని, హైదరాబాద్ తరహాలో మోడరన్ మహాప్రస్థానం శ్మశానవాటిక నిర్మాణానికి ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. మధిరకు కావాల్సింది రాజకీయాలు కాదని, కేవలం అభివృద్ధి మాత్రమేనని భట్టి విక్రమార్క ఉద్ఘాటించారు.

మిగతా 2వ పేజీలో..

ప్రచారం సమాప్తం

- ఏడు కార్పొరేషన్లు 116 మున్సిపాల్టీలలో ముగిసిన ప్రచారం
- 11 న పోలింగ్ కు ముమ్మర ఏర్పాట్లు
- బార్లు... మద్యం దుకాణాల బంద్ కు ఆదేశాలు

జర్నలిస్ట్ డైరీ,హైదరాబాద్:

రాష్ట్ర వ్యాప్తంగా ఏడు కార్పొరేషన్లు, 116 మున్సిపాల్టీలలో ఎన్నికల ప్రచారం ముగిసింది. మైకుల హోరు, పార్టీల ప్రచార జోరుకు తెరపడింది. ఈ నెల 11న ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటలవరకు పోలింగ్ జరుగనుంది. 13న కౌంటింగ్ నిర్వహిస్తారు. మొత్తం 2,996 వార్డుల్లో జరుగుతున్న ఈ ఎన్నికల్లో 12,993 మంది అభ్యర్థులు తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. 52 లక్షల మందిపైగా ఓటర్లు వీరి భవితవ్యాన్ని తేల్చనున్నారు. ఇందులో మహిళా ఓటర్లు 26 లక్షల మంది, పురుష ఓటర్లు 25 లక్షల మంది ఉన్నారు. ఎన్నికలను అత్యంత పారదర్శకంగా నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం చర్యలు చేపట్టింది. ఈసారి రాష్ట్ర ఎన్నికల సంఘం అత్యాధునిక సాంకేతికతను వినియోగిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసిన 8వేల 203 పోలింగ్ కేంద్రాల్లో 100 శాతం వెబ్‌కాస్టింగ్ సౌకర్యాన్ని కల్పించింది. ఈ ఎన్నికలు బ్యాలెట్ పేపర్ల ద్వారానే జరుగుతుండటంతో, సుమారు 16వేల 301 బ్యాలెట్ బాక్సులను సిద్ధం చేసి ఆయా కేంద్రాలకు పంపిణీ చేశారు. ఓటింగ్ ముగిసిన అనంతరం బ్యాలెట్ బాక్సులను స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించి, అక్కడ 24 గంటల పాటు కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేయనున్నారు. మరోవైపు 25,000 మంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 1,900 సమస్యాత్మక, 1,400 అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి, అక్కడ సీసీటీవీ మానిటరింగ్‌తో పటిష్ట నిఘా ఏర్పాటు చేశారు. ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు

మిగతా 2వ పేజీలో..

ఎన్నికలు కాగానే పన్నులు పెంచుతారు

- బిజెపి డీకే అరుణ ఆరోపణ
- రేవంత్‌రెడ్డి పాలనలో దారుణాలు

02

క్లాస్ రూమ్ లో లా విద్యార్థిని హత్య

- పంజాబ్ రాష్ట్రంలోని తరన్ తరణ్ లో దారుణం
- యువతి ని కాల్చి చంపి ఆత్మ హత్యా యత్నం

02

ఆన్‌లైన్ గేమింగ్ పేరిట కోట్ల రూపాయలు మళ్లించారు

- 5వేల కోట్లు మళ్లించినట్లు పోలీసుల నిర్ధారణ
- ఇద్దరు కీలక నిందితులు అరెస్ట్

02

రోడ్డు ప్రమాదాల్లో రక్షిస్తే

25 వేలు ఇస్తారు

- రహ-వీర్ పేరిట వినూత్న పథకం ప్రారంభం
- తెలంగాణ రవాణా శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి కమిటీల ఏర్పాటు

02

అగ్ని ప్రమాదం వెనుక

కేటీఆర్ హస్తం

- కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి

02

ఓటుకు నోటు కేసులో సాక్ష్యాలు మాయం చేసేందుకే

అగ్ని ప్రమాదం వెనుక రేవంత్ రెడ్డి హస్తం

మాజీ మంత్రి హరీష్ రావు ఆరోపణ

జర్నలిస్ట్ డైరీ,మెదక్:

ఓటుకు నోటు కేసులో రేవంత్ రెడ్డి జైలుకు వెళ్లడం ఖాయమని,అందుకే ఫోరెన్సిక్ ల్యాబ్‌ను దగ్ధం చేశారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు మరోసారి ఆరోపించారు. సోమవారం మెదక్‌లో హరీశ్ రావు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి డైరెక్షన్‌లోనే ఈ ప్రమాదం జరిగిందని ఆరోపించారు. ఈ కేసులో జైలుకు వెళ్లకుండా ఉండేందుకే సాక్ష్యాలను మాయం చేశారని అన్నారు. ఫోరెన్సిక్

మిగతా 2వ పేజీలో..

02

స్పీకర్ పై అవిశ్వాస తీర్మానం

- ఓం బిర్లా పై అవిశ్వాస తీర్మానం కోసం నోటీసులు
- ఖర్గే కార్యాలయంలో ప్రతిపక్ష పార్టీల సమావేశం

స్పీకర్ పై అవిశ్వాస తీర్మానం

- ఓం బిర్లా పై అవిశ్వాస తీర్మానం కోసం నోటీసులు
- ఖర్గే కార్యాలయంలో ప్రతిపక్ష పార్టీల సమావేశం

జర్నలిస్ట్ డైరీ,ఇంటర్నెట్ డెస్క్ :

సభలో తమను మాట్లాడేందుకు అనుమతించడం లేదంటూ స్పీకర్ ఓం బిర్లా పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు ప్రతిపక్ష పార్టీలు సిద్ధమయ్యాయి . పార్లమెంటు నిబంధనల ప్రకారం ఇప్పటికే నోటీసులు కూడా ఇచ్చినట్టు చెబుతున్నారు. అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలంటే 14 రోజుల ముందుగా నోటీసులు ఇవ్వాలి. ఆప్రకారం బడ్జెట్ రెండో విడత సమావేశాల్లో అవిశ్వాస తీర్మానం సభలో చర్చకు వచ్చే అవకాశం ఉంటుంది. బడ్జెట్ తొలి విడత సమావేశాలు జనవరి 8న ప్రారంభమై ఫిబ్రవరి 13తో ముగియనున్నాయి. రెండో విడత సమావేశాలు మార్చి 9న తిరిగి ప్రారంభమై ఏప్రిల్ 2 వరకూ జరుగుతాయి. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే కార్యాలయంలో సోమవారం ఉదయం జరిగిన సమావేశంలో అవిశ్వాస తీర్మానంపై నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. టీఎంసీ, డీఎంకే, వామపక్షాలు, సమాజ్‌వాదీ పార్టీ, శివసేన (యూబీటీ), ఎన్‌సీపీ (ఎస్పీ) తదితరల పార్టీల ఎంపీలు పాల్గొన్నట్టు చెబుతున్నారు. మరోవైపు, ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై దాడికి సిద్ధమయ్యామంటూ తమపై అసత్య ఆరోపణలు చేయడాన్ని కాంగ్రెస్ మహిళా ఎంపీలు ఖండించారు. ఈ మేరకు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు లేఖ రాశారు. ప్రజాస్వామ్య పద్ధతిలో శాంతియుతంగా తాము నిరసన తెలిపామని, హింసకు దిగాలని తాము అనుకోలేదని, విపక్షాలను ఎదుర్కొనే ధైర్యం ప్రధానికి లేకపోవడం వల్లే భయపడి సభకు రాలేదని మహిళా ఎంపీలు ఆ లేఖలో పేర్కొన్నారు. లోక్‌సభ స్పీకర్ నిష్పక్షపాతంగా ఉండాలన్నారు. ఎంపిక చేసి మరీ ఎంపీలను సస్పెండ్ చేశారని, మాజీ ప్రధానులపై బీజేపీ ఎంపీ అనుచిత వ్యాఖ్యలు చేస్తే పట్టించుకోలేదని అన్నారు. కాంగ్రెస్ ఎంపీ జోతిమణి తో పాటు పలువురు మహిళా ఎంపీలు ఈ లేఖపై సంతకాలు చేశారు.

క్లాస్ రూమ్ లో లా విద్యార్థిని హత్య

- పంజాబ్ రాష్ట్రంలోని తరన్ తరణ్ లో దారుణం
- యువతి ని కాల్చి చంపి ఆత్మ హత్యా యత్నం

జర్నలిస్ట్ డైరీ,ఇంటర్నెట్ డెస్క్:

లా కాలేజీ విద్యార్థి క్లాస్ రూములో తన తోటి విద్యార్థినిని తుపాకితో కాల్చి చంపి, తను కూడా అదే తుపాకితో కాల్చుకుని ఆత్మహత్య ప్రయత్నం చేశాడు. సోమవారం ఈ ఘటన చోటుచేసుకుంది. సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు .. పంజాబ్ రాష్ట్రంలోని తరన్ తరణ్ జిల్లాకు చెందిన ప్రిన్స్ రాజ్, సందీప్ కౌర్‌లు ఉస్మా గ్రామంలోని లా కాలేజీలో ఫస్ట్ ఇయర్ లా చదువుతున్నారు. ఏమైందో ఏమో తెలీదు కానీ, రాజ్.. కౌర్‌పై పగ పెంచుకున్నాడు. ఉదయం కాలేజీకి రాగానే ఈ దారుణానికి ఒడిగట్టాడు. వెంట తెచ్చుకున్న తుపాకితో క్లాస్ రూములో కౌర్‌పై కాల్పులకు తెగబడ్డాడు. దీంతో కౌర్ అక్కడికక్కడే ప్రాణాలు విడిచింది. కౌర్ చనిపోయిందని ధ్రువీకరించుకున్న తర్వాత రాజ్ అదే తుపాకితో తనను తాను కాల్చుకున్నాడు. కాలేజీ యాజమాన్యం ఇచ్చిన సమాచారంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. తీవ్ర గాయాలపాలైన రాజ్‌ను చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. రాజ్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు పోలీసులు చెబుతున్నారు. ఇక ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదాల్లో రక్షిస్తే 25 వేలు ఇస్తారు

- రహ-వీర్ పేరిట వినూత్న పథకం ప్రారంభం
- తెలంగాణ రవాణా శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి కమిటీల ఏర్పాటు

జర్నలిస్ట్ డైరీ హైదరాబాద్:

రోడ్డు ప్రమాదాల వల్ల కలిగే మరణాలను తగ్గించే ప్రయత్నంలో భాగంగా తెలంగాణ రవాణా శాఖ రహవీర్ పథకాన్ని ప్రకటించింది. దీని కింద రోడ్డు ప్రమాద బాధితుల ప్రాణాలను కాపాడే పౌరులకు 25 వేల రూపాయలు నగదు ప్రోత్సాహకం ఇస్తుంది. అంతేకాదు అధికారికంగా సత్కరిస్తారు. సర్టిఫికేట్ కూడా అందిస్తారు. జిల్లా స్థాయి కమిటీలను ఏర్పాటు చేయాలని, ఎంపిక విధానాలను రూపొందించాలని, ఈ పథకానికి విస్తృత ప్రచారం కల్పించాలని అన్ని జిల్లాల కలెక్టర్లకు ఒక సర్క్యులర్ జారీ చేసింది ప్రభుత్వం. ఈ పథకం కింద ప్రమాద బాధితులకు తక్షణ సహాయం అందించడానికి, వారిని ఆసుపత్రులకు తరలించడానికి పౌరులు ముందుకు వస్తారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. రోడ్డు ప్రమాద బాధితులను కాపాడే వారిని రహవీర్‌లుగా ప్రభుత్వం గుర్తిస్తుంది. ప్రాణాలను కాపాడడంలో పౌరులు సకాలంలో జోక్యం చేసుకోవడం చాలా కీలకమని అధికారులు తెలిపారు చట్టపరమైన లేదా విధానపరమైన వేధింపులకు భయపడకుండా ఇటువంటి చర్యలను ప్రోత్సహించడమే దీని లక్ష్యం. మార్గదర్శకాల ప్రకారం, తక్షణ సహాయం అందించే, బాధితుడిని ఆసుపత్రికి తరలించే వ్యక్తి వివరాలను సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్ , ఆసుపత్రి అధికారులు నమోదు చేస్తారు. ఆ తరువాత పోలీసులు ఈ కేసును జిల్లా కలెక్టర్ ఛైర్మన్‌గా, పోలీసు సూపరింటెండెంట్, జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి సభ్యులుగా, జిల్లా రవాణా అధికారి కన్వీనర్‌గా ఉన్న జిల్లా స్థాయి కమిటీకి సిఫార్సు చేస్తారు. పరిశీలన, ఆమోదం తర్వాత ఎంపికైన రహవీర్ల వివరాలను రివార్డ్, సర్టిఫికేట్ కోసం రవాణా కమిషనర్‌కు పంపుతుంది.

ప్రమాద దృశ్యాలను చూసి కేవలం ప్రేక్షకులుగా ఉండకూడదని, బాధితులకు సహాయం చేయడానికి నిర్భయంగా ముందుకు రావాలని రవాణా శాఖ ప్రజలకు విజ్ఞప్తి చేసింది. బాధ్యతగల పౌరులుగా ఉండాలని కోరుతోంది. ఒక చిన్న సాయం కూడా ఒక ప్రాణాన్ని కాపాడుతుంది. సహాయం అందించే వారికి పూర్తి రక్షణ, గౌరవం కల్పిస్తామని అధికారులు హామీ ఇస్తున్నారు.

ప్రచారం సమాప్తం

మొదటిపేజీ తరువాయి

జరగకుండా మద్యం దుకాణాలను కూడా మూసివేశారు. పోలింగ్ కు మరో రెండు రోజులు మాత్రమే వుండటం తో ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు అభ్యర్థులు పడ రాని పాట్లు పడుతున్నారు. ఓటర్లను తమవైపు తిప్పుకునేందుకు రకరకాల హామీలు ఇస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఓట్ల కోసం కొత్త కొత్త హామీల వర్షం కురిపిస్తూ ఓటర్లనే ఆశ్చర్యానికి గురి చేస్తున్నారు. మద్యం, డబ్బు, బిర్యానీ, చికెన్, మటన్.. ఇంటింటికీ తిరిగి పంచేవారు. కానీ ఈ మున్సిపల్ ఎన్నికల్లో మాత్రం అది కాస్తా హద్దు దాటింది. ఇళ్లల్లోకి కావాల్సిన ఖరీదైన వస్తువులను ఇచ్చేస్తున్నారు. టీవీలు, ఫ్రిజ్‌లు, వాషింగ్ మెషీన్లు, మిక్సీలు, రైస్ కుక్కర్లు, ప్రెజర్ కుక్కర్లు, డిన్నర్ సెట్‌లు, కూలర్లు.. ఇలా ఒక్కటేంటీ రకరకాల వస్తువులను పంచుతున్నారు. వీటితోపాటు తమ వార్డు పరిధిలో ఉన్న వారి ఇళ్లల్లో ఆడపిల్లల పెళ్లిళ్లు జరిగితే వారికి ఆర్థిక సాయం అందిస్తామని హామీలు కురిపిస్తున్నారు. అంతేకాకుండా పుట్టే ఆడబిడ్డల పేరు మీద కూడా డబ్బులు ఇస్తామని పేర్కొంటున్నారు. ఇంకా కొందరు బాండ్ పేపర్ల మీద హామీలు రాసిస్తుండగా.. మరికొందరు ఓటర్ల నుంచి ప్రమాణాలు తీసుకుంటున్నారు. ఇదిలా ఉండగా, రాష్ట్ర వ్యాప్తంగా రెండు రోజులపాటు మద్యం దుకాణాల బంద్‌కు అధికారులు ఆదేశాలు జారీ చేశారు. తెలంగాణలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల ప్రక్రియ దృష్ట్యా శాంతిభద్రతల పరిరక్షణ, ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు వీలుగా ఎన్నికలు జరిగే 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్ల పరిధిలోని వైన్స్, బార్లను రెండు రోజుల పాటు మూసివేయనున్నారు. ఇవాళ మున్సిపల్ ఎన్నికల ప్రచారం గడువు

ముగియనుండటంతో సాయంత్రం 5 గంటల నుంచి పోలింగ్ రోజు అంటే ఫిబ్రవరి 11వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు మద్యం అమ్మకాలను ఆ ప్రాంతాల్లో పూర్తిగా నిషేధించారు.

ఆన్‌లైన్ గేమింగ్ పేరిట
కోట్ల రూపాయలు మళ్లించారు

- 5వేల కోట్లు మళ్లించినట్లు పోలీసుల నిర్ధారణ
- ఇద్దరు కీలక నిందితులు అరెస్ట్

జర్నలిస్ట్ డైరీ,హైదరాబాద్:

డూప్లికేట్ కంపెనీలకు రూ.5వేల కోట్లు మళ్లించి ఆన్‌లైన్ గేమింగ్ కుంభకోణం చేసిన ముఠా ను హైదరాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు. దుబాయ్ కేంద్రంగా ఆన్‌లైన్ గేమింగ్ స్కామ్ జరిగినట్లు ప్రాథమిక విచారణ లో గుర్తించారు. ఫిన్‌టెక్ ప్లాట్‌ఫామ్‌లు, రెంటెడ్ బ్యాంక్ అకౌంట్ల ద్వారా ఈ అక్రమ లావాదేవీలు జరిగినట్లు తెలుస్తోంది. జీఎస్టీ ఎగవేతకు ఎస్క్రో ఖాతాలను దుర్వినియోగం చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఫిన్‌టెక్ సంస్థలు, రేస్‌జీఈటీ247 వంటి వెబ్‌సైట్ల ద్వారా అక్రమ దందా నడిచినట్లు బయటపడింది.

బ్యాంకింగ్ ఏపీఐలను అక్రమంగా ఉపయోగించి, ఆడిట్‌కు దొరక్కుండా నిందితులు జాగ్రత్త పడ్డారని పోలీసులు తెలిపారు. రియల్ మనీ గేమింగ్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా భారీ మొత్తాలు షెల్ కంపెనీలకు మళ్లించినట్టు విచారణలో వెల్లడైంది. ఈ స్కామ్‌లో కీలక నిందితులుగా ఉన్న 'విగోఫిన్ డిజిటల్ సొల్యూషన్స్' డైరెక్టర్లు వైఎస్ ప్రభుకుమార్, రాజశేఖర్ రెడ్డిని పోలీసులు అరెస్టు చేశారు. ప్రస్తుతం వీరిద్దరినీ పోలీసులు విచారిస్తున్నారు. విచారణలో దీనికి సంబంధించి మరిన్ని కీలక విషయాలు బయటకు వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

అగ్ని ప్రమాదం వెనుక కేటీఆర్ హస్తం

- కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

జర్నలిస్ట్ డైరీ హైదరాబాద్:

ఫోరెన్సిక్ ల్యాబ్‌లో అగ్ని ప్రమాదం వెనుక కేటీఆర్ హస్తం ఉందేమోనన్న అనుమానాన్ని కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి వ్యక్తం చేశారు. అందుకే ముందే వచ్చి సీఎం రేవంత్‌రెడ్డిపై ఆయన అభాండాలు వేస్తున్నారని మండిపడ్డారు. ఫోన్ ట్యాపింగ్ కేసుకు సంబంధించి టేపులు, వివరాలూ ఫోరెన్సిక్ ల్యాబ్‌లోనే ఉన్నాయన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోగానే ఎస్ఐబీ కార్యాలయంలో సీసీ కెమెరాలు బంద్ చేసి.. ఇజ్రాయెల్ నుంచి తెచ్చిన పరికరాలు, ఫైళ్లను ధ్వంసం చేసి.. మూసీ నదిలో పడేయించిన చరిత్ర కేటీఆర్‌కు ఉందని ఒక ప్రకటనలో ఆయన పేర్కొన్నారు.

కేసీఆర్‌ది ఉద్యమ చరిత్ర, సీఎం రేవంత్‌ది ద్రోహ చరిత్రంటూ హరీశ్‌రావు చేసిన వ్యాఖ్యలపై చామల ఆగ్రహం వ్యక్తం చేశారు. 'వాస్తవానికి ఉద్యమం పేరు చెప్పి రూ.వేల కోట్లు సంపాదించుకున్న చరిత్ర.. కుటుంబంలో ఐదు ఉద్యోగాలు ఇచ్చుకున్న చరిత్ర కేసీఆర్‌ది. కమీషన్లు దండుకుని మిగులు రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిన చరిత్ర వారిది' అని విమర్శించారు.

ఓటుకు నోటు కేసులో సాక్ష్యాలు మాయం చేసేందుకే

మొదటిపేజీ తరువాయి

ల్యాబొరేటరిలో జరిగిన ప్రమాదం ప్రమాదవశాత్తు జరిగింది కాదన్నారు. ఈ ప్రమాదం వెనుక సీఎం రేవంత్ రెడ్డి హస్తం ఉందన్నారు. ఓటుకు నోటు కేసులో దొరికిపోయిన దొంగ అంటూ రేవంత్ అని పేర్కొంటూ జైలుకు పోయే సమయం ఆసన్నమైందని.. అందుకే సాక్ష్యాలు మాయం చేసేందుకు హైద్రాబాద్‌లోని ఫోరెన్సిక్ ల్యాబ్‌ను దగ్ధం చేశారంటూ రేవంత్ రెడ్డిపై విమర్శలు గుప్పించారు. పోలీసుల సహకారంతోనే సీఎం ఈ కుట్రపన్నారని పేర్కొన్నారు. రెండున్నరేళ్ల కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసింది గుండు సున్నా అని రేవంత్ పాలనపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతు బంధు ఎగ్గొట్టారు.. రాష్ట్రంలో ఎరువుల కరువు తెచ్చారంటూ విమర్శించారు. రేవంత్ బూతులు మాట్లాడటం తప్ప ఒక్క మంచి పని చేయలేదని హరీశ్ రావు అన్నారు.

ఎన్నికలు కాగానే పన్నులు పెంచుతారు

- బిజెపి డీకే అరుణ ఆరోపణ
- రేవంత్‌రెడ్డి పాలనలో దారుణాలు

జర్నలిస్ట్ డైరీ,మహబూబ్ నగర్:

రేవంత్‌రెడ్డి పాలన లో మహిళలపై అత్యాచారాలు, హత్యలు, దారుణాలు పెరిగిపోయాయని బీజేపీ మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు , మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ ఆరోపించారు. ఎన్నికల తర్వాత మున్సిపల్ పన్నులు పెంచేందుకు రేవంత్ రెడ్డి సర్కార్ సిద్ధమవుతోందని ఆరోపించారు. రాష్ట్ర ఖజానాలో చిల్లిగవ్వ లేదని , ప్రజలను మరోసారి మోసం చేసేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోందని మహబూబ్ నగర్ లో మీడియా సమావేశంలో విమర్శించారు. మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గంతో పాటు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నానని అరుణ తెలిపారు. అన్ని మున్సిపాలిటీల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పార్టీ హైకమాండ్ ఆదేశాల మేరకు ప్రచారం నిర్వహించానని తెలిపారు. మహబూబ్‌నగర్ చుట్టుపక్కల గ్రామాలు విలీన గ్రామాలుగా కలిశాయని ఎంపీ అరుణ వివరించారు. కార్పొరేషన్ అభివృద్ధి కోసం మాస్టర్ ప్లాన్ కూడా అవసరం ఉందని అన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. బీజేపీ అభ్యర్థులు ఎన్నికల్లో గెలవగానే సీనియర్ సిటిజన్ ల కోసం ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేస్తామని తెలిపారు. అవినీతి రహిత, పారదర్శకమైన పాలన అందించడమే బీజేపీ లక్ష్యమని ఉద్ఘాటించారు. ప్రతి వార్డులో డ్రైనేజీ, తాగునీరు, విద్యుత్ తదితర అంశాలపై దృష్టి సారించి.. కేంద్ర ప్రభుత్వ నిధులతో అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు.

మధిర రూపు రేఖలు మారుస్తా

మొదటిపేజీ తరువాయి

అభ్యర్థుల గెలుపు రాజకీయాల కోసం కాదని.. అభివృద్ధి కోసమే అని చెప్పారు. అన్ని వర్గాల అభివృద్ధి కోసం కాంగ్రెస్‌టీడీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. డబ్బు ప్రధానం కాదని.. అభివృద్ధే ప్రధానమని, వ్యక్తులకన్నా వ్యవస్థలే ముఖ్యమని డిప్యూటీ సీఎం వివరించారు. మధిర మున్సిపాలిటీని రాష్ట్రానికి మోడల్ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతామని ఆయన హామీ ఇచ్చారు. ఏ అవసరం ఉన్నా ప్రజలందరికీ అండగా నిలుస్తానని చెప్పారు. విజ్ఞులైన ప్రతి ఒక్కరూ మధిర అభివృద్ధిపై తమ ఆలోచనలు పంచుకోవాలని కోరారు. మహిళలను వడ్డీలేని రుణాలతో స్వయం ఉపాధి వ్యాపారస్తులుగా తీర్చిదిద్దుతామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

రాష్ట్రానికి పట్టిన దరిద్రం బీఆర్ఎస్

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోపణ
- మున్సిపల్ ఎన్నికల్లో త్రిముఖ పోటీ

జర్నలిస్ట్ డైరీ,హైదరాబాద్:

బీఆర్ఎస్ నేతలు బరి తెగించి మాట్లాడుతున్నారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణలో ఏర్పడిన దరిద్రానికి కారణం బీఆర్ఎస్ పార్టీనే నని సోమవారం హైదరాబాద్‌లో రేవంత్ రెడ్డి మీడియాతో అన్నారు. తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో త్రిముఖ పోటీ ఉందన్నారు. చెప్పారు. బీఆర్ఎస్‌ను యాసిడ్‌తో కడిగినా.. ఆ దరిద్రం పోదంటూ ఎద్దేవా చేశారు. ప్రతిపక్ష నేతగా ఏనాడైనా సభకు వచ్చి ప్రజా సమస్యలు ప్రస్తావించారా? అని కేసీఆర్ వ్యవహారశైలిని ఆయన తప్పుబట్టారు. ప్రభుత్వ సదుపాయాలు తీసుకుంటూ.. సభకు రారా? అంటూ బీఆర్ఎస్ అధినేతకు చురకలంటించారు. అలాంటి పార్టీకి ఓట్లు అడిగే అధికారం ఉందా? అని ఆ పార్టీ నేతల నుద్దేశించి ప్రశ్నించారు. ప్రముఖుల ఫోన్లు ట్యాపింగ్ చేసి నగదు వసూలు చేశారని సీఎం ఆరోపించారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలది విడదీయరాని బంధమని రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. నోట్ల రద్దు, జీఎస్టీకి బీఆర్ఎస్ నేతలు మద్దతివ్వలేదా? అని ప్రశ్నించారు. పదేళ్లలో ఎన్ని డబుల్ బెడ్రూమ్‌లు ఇచ్చారంటూ బీఆర్ఎస్ నేతలపై ప్రశ్నల వర్షం కురిపించారు. రెండేళ్లలో 4 లక్షల 50 వేల ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తున్నామని తెలిపారు. చెప్పుకొచ్చారు. తెలంగాణ రాష్ట్రానికి బీజేపీ ఏం చేసిందో చెప్పాలంటూ ఆ పార్టీ అగ్రనేతలను రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. 12 ఏళ్లుగా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం.. రాష్ట్రానికి ఏమైనా ప్రాజెక్టులు ఇచ్చిందా? అంటూ ఆ పార్టీ నేతలను సూటిగా ప్రశ్నించారు. ప్రధాని మోదీని చూసి ఓటేయాలని బీజేపీ నేతలు అడుగుతున్నారన్నారు. కానీ హామీల అమలు గురించి మాత్రం చెప్పట్లేదంటూ బీజేపీ నేతలపై ఆగ్రహం వ్యక్తం చేశారు . ఈ మేరకు భవిష్యత్తును ఆలోచించి రాబోయే ఎన్నికల్లో ఓటు వేయాలంటూ ఓటర్లకు సూచించారు. ఎన్నికల ప్రచారానికి వచ్చిన మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ అవమానించారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. మూసీ నది అభివృద్ధికి కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ నిధులు తెచ్చారా? అని రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. పాలమూరు ప్రాజెక్టుకు జాతీయ హోదా కూడా వారు తేలేదన్నారు. అలాగే హైదరాబాద్ మెట్రో విస్తరణకు కూడా నిధులు ఇవ్వలేదని విమర్శించారు. తెలంగాణకు కేటాయించిన సెమీకండక్టర్ ప్రాజెక్ట్‌ను.. చివరి నిమిషంలో ప్రధాని నరేంద్ర మోదీ ఒత్తిడితో పొరుగునున్న ఆంధ్ర ప్రదేశ్‌కు తరలించారని రేవంత్ రెడ్డి విమర్శించారు.

మేడారం జాతర లో 10 కోట్లు దాటిన ఆదాయం

జర్నలిస్ట్ డైరీ,వరంగల్:
మేడారం సమ్మక్క సారలమ్మ జాతరకు సంబంధించిన హుండీల లెక్కింపు కార్యక్రమం కొనసాగుతోంది. ఐదవ రోజు కూడా హుండీల లెక్కింపు కొనసాగుతోంది. హన్మకొండలోని టిటిడి కళ్యాణమండపంలో దేవాదాయ శాఖ అధికారుల సమక్షంలో ఈ హుండీల లెక్కింపు జరుగుతుంది. 400 మందికి పైగా సిబ్బంది, అధికారులు ఈ హుండీల లెక్కింపులో పాల్గొంటున్నారు. మొత్తం నాలుగు రోజులలో మొత్తం 625 హుండీలను లెక్కించారు. ఇప్పటివరకు మేడారం జాతర హుండీలలో 10 కోట్లకు పైగా ఆదాయం రాగా, ఈసారి ఆదాయం బాగానే వస్తుందని అధికారులు భావిస్తున్నారు. గత జాతరలో 13 కోట్ల రూపాయలకు పైగా ఆదాయం వచ్చింది. ఈసారి అంతకంటే ఎక్కువ ఆదాయం వస్తుందని అంచనా వేస్తున్నారు. సీసీ కెమెరాలు, పోలీస్ బందోబస్తు మధ్య ఈ లెక్కింపు కార్యక్రమం కొనసాగుతుంది. ఇప్పటివరకు నాలుగు రోజులలో లెక్కించిన హుండీల ద్వారా 10,71,22,116 రూపాయల ఆదాయం వచ్చిందని అధికారులు వెల్లడించారు. మొదటిరోజు 125 హుండీలను లెక్కించగా, రెండవ రోజు 160 హుండీలను లెక్కించారు, మూడవరోజు 140, నాలుగవ రోజు 200 హుండీలు లెక్కింపు చేశారు. నాలుగవ రోజు హుండీల లెక్కింపులో 2కోట్ల 64 లక్షల 75 వేల 757 రూపాయల ఆదాయం వచ్చింది.

షాద్ నగర్ లో కాంగ్రెస్ బైక్ ర్యాలీ

జర్నలిస్ట్ డైరీ, షాద్ నగర్:
మూడు రంగుల కాంగ్రెస్ జెండాలు రెపరెపలాడుతుండగా, నినాదాలతో మారుమోగిన ఏడవ వార్డు వీధులు ఆదివారం రాజకీయ వేడిని సంతరించుకున్నాయి. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో భారీ ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించగా, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి శ్యాంసుందర్ రెడ్డి తదితర నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ర్యాలీ సందర్భంగా నేతలు వార్డు వీధులన్నింటిలో పర్యటిస్తూ ప్రజలను ఆప్యాయంగా పలకరించారు. ఈ సందర్భంగా వార్డు నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కొప్పునూరు ప్రవీణ్ కుమార్ ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఇంటింటి ప్రచారంలో భాగంగా ఎమ్మెల్యే శంకర్ ఓటర్లతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. "చేతి గుర్తుకు ఓటు వేసి ప్రవీణ్ కుమార్‌ను గెలిపిస్తే, వార్డును అన్ని విధాలుగా అభివృద్ధి చేసే బాధ్యత నా దే" అని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఇప్పటికే సీసీ రోడ్లు, కాలువలు, విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు వంటి అభివృద్ధి పనులు చేపట్టామని గుర్తు చేశారు. భవిష్యత్తులో మరిన్ని మౌలిక వసతులు కల్పిస్తామని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ, "వార్డు ఆదర్శవంతంగా మారాలంటే కాంగ్రెస్ అభ్యర్థి గెలవాలి. ప్రతి ఓటరు చేతి గుర్తుకు ఓటు వేసి కొప్పునూరు ప్రవీణ్ కుమార్‌కు మద్దతు ఇవ్వాలి" అని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ కార్యకర్తల నినాదాలతో వాతావరణం ఉత్సాహభరితంగా మారింది.

చివరి రోజు జోరుగా ప్రచారం

జర్నలిస్ట్ డైరీ,షాద్ నగర్:
అభివృద్ధి జరగాలంటే కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించండి ఎమ్మెల్యే శంకర్ పిలుపు నిచ్చారు..షాద్ నగర్ మున్సిపాలిటీలో చివరి రోజూ సోమవారం ప్రచారం జోరుగా సాగింది.అటు కాంగ్రెస్ అభ్యర్థులు,ఇటు బీఆర్ఎస్ అభ్యర్థులు ఇంటింటికీ వెళ్లి ఓటు వేయాలని అభ్యర్థించారు.చివరి రోజు ఎమ్మెల్యే శంకర్ వార్డుల్లో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ,అభివృద్ధి పథకాలను వివరించారు.28వ వార్డు అభ్యర్థి కాటం భాగ్యలక్ష్మి గౌడ్ తో కలిసి రోడ్ షో,ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు.వార్డు అభివృద్ధి జరగాలంటే కాటం భాగ్యలక్ష్మి గౌడ్ ను గెలిపించాలని కోరారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ,,,మున్సిపాలిటీని మరింత అభివృద్ధి చేసుకుందాం అంటూ పిలుపునిచ్చారు.ప్రతి ఓటరును కలిసి ఓటు వేయాలని అభ్యర్థించారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలను ఓటర్లకు వివరించాలని సూచించారు.ఈ ప్రచారంలో ఎమ్మెల్యేతో పాటు మహిళలు, కాలనీ వాసులు, యువకులు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ధనవంతులకు కాదు...
గుణవంతులకు ఓటు

జర్నలిస్ట్ డైరీ, నాగారం:-
ప్రజల నమ్మకమే మా బలం అదే మా విజయం అని అలియాబాద్‌లో బిజెపి సోమవారం ఇంటింటి ప్రచారం నిర్వహించింది. బిజెపి మేడ్చల్ నియోజకవర్గం ఇంచార్జి, మాజీ ఎంపిపి ఏనుగు సుదర్శన్ రెడ్డి పిలుపు మేరకు మేడ్చల్ జిల్లా అలియాబాద్ మున్సిపల్ పరిధిలోని తుర్కపల్లి 2వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి మంజుల వినోద్ యాదవ్ మద్దతుగా జిల్లా ఉపాధ్యక్షులు గోంగళ్ళ బాలేష్, కార్యకర్తలు కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏనుగు సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలు ఈసారి ధనవంతులకు కాదు, గుణవంతులకు ఓటు వేయాలని, డబ్బుతో రాజకీయాలు చేసే వాళ్లు కాదు, ప్రజల కోసం పనిచేసే నాయకులకే అవకాశం ఇవ్వాలి "అని పిలుపునిచ్చారు.
ప్రజల సమస్యలను అర్థం చేసుకుని నిజాయితీగా పనిచేసే అభ్యర్థి మంజుల వినోద్ యాదవ్ కు మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజల నుంచి మంచి స్పందన లభించడంతో పాటు, బిజెపికి అనుకూల వాతావరణం స్పష్టంగా కనిపించిందని తెలిపారు.

ఇంటింటి ప్రచారం లో
బీఆర్ఎస్ నేతలు

జర్నలిస్ట్ డైరీ, షాద్ నగర్:
"వార్డు అభివృద్ధి నిరంతరం కొనసాగాలంటే కారు గుర్తుకే ఓటు వేయాలి. ప్రజలకు అందుబాటులో ఉండే నాయకుడు ఈశ్వర్ రాజును భారీ మెజారిటీతో గెలిపించాలి" అని బీఆర్ఎస్ నాయకులు పిలుపునిచ్చారు. మున్సిపల్ ఎన్నికల సందర్భంగా షాద్‌నగర్ 7వ వార్డులో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తూ ఓటర్లను కలిసి మద్దతు కోరారు. ఈ కార్యక్రమంలో కేశంపేట మండల మాజీ జెడ్పిటిసి నర్సింగ్ రావు, యువ నాయకుడు ప్రేమ్ కుమార్ గౌడ్, డిప్యూటీ సర్పంచ్ నరేష్, వార్డు సభ్యులు మాధవులు, దశరథ్, ఆసిఫ్, మహేష్, సురేష్ యాదవ్, పోలేపోగు మాధవ్, శ్రీశైలం యాదవ్ తదితరులు పాల్గొన్నారు. కాలనీల్లో తిరుగుతూ ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. మాజీ జెడ్పిటిసి నర్సింగ్ రావు మాట్లాడుతూ, "ఈశ్వర్ రాజు స్థానికంగా అందరికీ అందుబాటులో ఉండే వ్యక్తి. వార్డు అభివృద్ధి కోసం కృషి చేస్తారు. కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరుతున్నాం" అన్నారు. యువ నాయకుడు ప్రేమ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ, "ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజలకు చేరాలంటే స్థానికంగా బలమైన నాయకత్వం అవసరమని తెలిపారు.

కీసరలో ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్

జర్నలిస్ట్ డైరీ, నాగారం:-
మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని ఈ నెల 13 నుండి 18 వరకు జరగనున్న కీసరగుట్ట శ్రీ రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు హాజరయ్యే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా సమగ్రమైన ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ మనుచౌదరి అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా విఐపి దర్శనాల కారణంగా సామాన్య భక్తుల దర్శనానికి ఆటంకం లేకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. సోమవారం కీసరగుట్ట కు వచ్చిన కలెక్టర్ ఆలయ పరిసరాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి మల్కాజిగిరి డీసీపి శ్రీధర్, ట్రాఫిక్ డీసీపి రాహుల్ రెడ్డి, ఆర్డీవో రాజేష్, ఆలయ కమిటీ చైర్మన్ తటాకం వెంకటేష్, ఆలయ ఈవో సుధాకర్ రెడ్డి తో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం పురోహితులు పూర్ణ కుంభం తో కలెక్టర్ కు ఘన స్వాగతం పలికారు. సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ భక్తుల రద్ది దృష్ట్యా దర్శన క్యూలైన్ లను విస్తరించాలని, ఆర్టీసీ బస్సుల సంఖ్యను పెంచి రద్ధీ ప్రాంతాల నుండి ప్రత్యేక బస్సులు నడపాలని ఆదేశించారు. భక్తుల భద్రతకు పటిష్టమైన పోలీసు బంధోబస్తు ఏర్పాటు చేయాలని, ట్రాఫిక్ నియంత్రణ కొరకు ప్రత్యేక ప్రణాళిక అమలు చేయాలని సూచించారు. జాతర ప్రాంగణంలో అత్యవసర వైద్య సేవల కోసం వైద్య సిబ్బంది, అవసరమైన మందులు, అంబులెన్స్ లను అందుబాటులో ఉంచాలన్నారు. వేసవి తీవ్రత నేపథ్యంలో దర్శన మార్గాలు, ఆలయ ప్రాంగణంలో త్రాగునీటి సౌకర్యం కల్పించాలని వాటర్ వర్క్స్ అధికారులను ఆదేశించారు. వృద్ధులు, దివ్యాంగులకు ప్రత్యేక వాహన సౌకర్యం కల్పించి దర్శనానికి ఏర్పాట్లు చేయాలని తెలిపారు. పారిశుధ్య పై దృష్టి సారించి పారిశుధ్య పనులు నిరంతరం చేపట్టాలన్నారు. ఆలయ ప్రాంగణంలో వ్యాపారులు అధిక ధరలు వసూలు చేయకుండా చర్యలు తీసుకోవాలని, ధరల వివరాలు స్పష్టంగా ప్రదర్శించేలా చూడాలని సూచించారు. అగ్ని ప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలుగా అగ్నిమాపక సిబ్బంది ఫైరింజన్లను సిద్ధంగా ఉంచాలన్నారు. బ్రహ్మోత్సవాలను అధికారులు, ప్రజాప్రతినిధులు ఆలయ కమిటీ సమన్వయంతో విజయవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా చెందిన వివిధ శాఖల అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆ కేసులో అరెస్ట్ చేయొద్దు

- మాజీ మంత్రి అంబటి రాంబాబుకు ఎపి హైకోర్టు లో ఊరట
- మార్చి 2కు విచారణ వాయిదా

జర్నలిస్ట్ డైరీ, అమరావతి:
చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యలు చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటూ ప్రస్తుతం రాజమండ్రి సెంట్రల్ జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న వైఎస్సార్సీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు దాఖలు చేసిన పిటిషన్ పై హైకోర్టు ఇవాళ కీలక ఆదేశాలు ఇచ్చింది. తనపై నమోదైన 36 కేసుల్ని క్వాష్ చేయాలంటూ హైకోర్టులో అంబటి పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన హైకోర్టు ఇవాళ పోలీసులకు కీలక ఆదేశాలు జారీ చేసింది. 35 కేసుల్లో అంబటిని అరెస్ట్ చేయొద్దంటూ హైకోర్టు ఆదేశాలు ఇచ్చింది. అలాగే ఈ కేసుల్లో 41ఏ నోటీసులు ఇచ్చి విచారించాలని హైకోర్టు ఆదేశించింది. 35 కేసులకు సంబంధించి క్వాష్ పిటిషన్ పై మాత్రం మార్చి 2కు విచారణ వాయిదా వేసింది. మరోవైపు ప్రస్తుతం అంబటి జైల్లో ఉన్న కేసుకు సంబంధించి ఆయన బెయిల్ పొందే అవకాశం ఉండటంతో ఇతర చోట్ల నమోదైన కేసుల్లో ఆయన్ను అరెస్టు చేయాలని ప్రభుత్వం భావించింది. అయితే ఈ కేసుల్నీ ఒకే వ్యాఖ్యలపై ఉండటంతో హైకోర్టు వీటిపై 41ఏ నోటీసు ఇచ్చి విచారణ జరపాలని, ఆయన్ను అరెస్టు చేయొద్దని ఆదేశాలు జారీ చేసింది.

బాలుడి ఆచూకీ చెప్పండి

జర్నలిస్ట్ డైరీ,ఎల్బీ నగర్:
మానసిక అస్వస్థతకు గురైన బాలుడు ఇంటి నుంచి తప్పి పోయిన సంఘటన ఎల్ బీ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ని సరస్వతి నగర్ లో జరిగింది.
ఆకాష్ రెడ్డి అనే 14 సంవత్సరాల బాలుడు మానసికంగా అస్వస్థత తో బాధపడుతున్నాడని ,ఎవరికి చెప్పకుండా ఇంట్లో నుంచి వెళ్లిపోయాడని పోలీసులు చెప్పారు. ఈ బాలుడి ఆచూకీ తెలిసిన వారు పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

జగన్ గూడలో కాంగ్రెస్ ప్రచారం

జర్నలిస్ట్ డైరీ, నాగారం:-
మేడ్చల్ నియోజకవర్గం లో ఎన్నికల సందర్భంగా మూడు చింతలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని జగన్ గూడాలో సోమవారం నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో మేడ్చల్,మల్కాజ్గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్, మల్కాజ్గిరి పార్లమెంట్ కంటెస్టెంట్ సభ్యురాలు పత్నం సునీత మహేందర్ రెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధి సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, రాష్ట్ర నాయకులు నక్క ప్రభాకర్ రెడ్డి పాల్గొన్ని ప్రసంగించారు.
ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తుందన్నారు. మున్సిపాలిటీలో అభివృద్ధి, మౌలిక సదుపాయాలు, పారదర్శక పాలన కోసం కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని ప్రజలను కోరారు. కేంద్ర, రాష్ట్ర స్థాయిలో కాంగ్రెస్ చేపట్టిన సంక్షేమ పథకాలు పేదల జీవితాల్లో మార్పు తీసుకొస్తున్నాయని పేర్కొన్నారు.
కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే మున్సిపాలిటీలో తాగునీరు, డ్రైనేజీ, రోడ్లు, పారిశుధ్యం వంటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు.
ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేశారు.

కాంగ్రెస్ ఇంటింటి ప్రచారం

జర్నలిస్ట్ డైరీ, నాగారం:-
మేడ్చల్ నియోజకవర్గం మూడు చింతలపల్లి మున్సిపాలిటీ ఎన్నికల్లో భాగంగా 7వ వార్డు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి శ్రీకాంత్ నాయక్ కు మద్దతుగా సోమవారం ఇంటింటికి ఎన్నికల ప్రచారం నిర్వహించారు.
ఈ కార్యక్రమంలో మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొని స్థానిక ప్రజలను కలుసుకొని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తోందని, మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు వేగవంతం కావాలంటే కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు అవసరమని అన్నారు. ప్రజలు ఇచ్చే మద్దతే పార్టీకి బలం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా మార్కెట్ కమిటీ ఛైర్మెన్ నర్సింహా యాదవ్, జిల్లా ఆర్టివి మెంబర్ జైపాల్ రెడ్డి, మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో ప్రముఖ సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ ఆత్మహత్య!

ప్రముఖ సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ చిన్ను పప్పు అనుమానాస్పద స్థితిలో ఆత్మహత్య చేసుకుంది. 24 ఏళ్ల చిన్ను పప్పు అసలు పేరు 'రేష్మ'. కాసర్కోడ్ నగర సమీపంలోని ఒక అద్దె క్వార్టర్స్ లో ఆమె శవమై కనిపించడం స్థానికంగా కలకలం రేపింది. ఆదూర్ ప్రాంతానికి చెందిన రేష్మ.. గత కొంతకాలంగా కాసర్కోడ్ నగరానికి సమీపంలోని ఒక అద్దె ఇంట్లో నివసిస్తుంది. సోమవారం మధ్యాహ్నం ఆమె తన గదిలో సీలింగ్ ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించింది. దీనితో వెంటనే అక్కడి వారు ఆమెను ఆసుపత్రికి తరలించినప్పటికీ.. అప్పటికే మరణించినట్లు వైద్యులు ధృవీకరించారు. గంగాధరన్, శైలజ దంపతుల కుమార్తె రేష్మ. ఇకపోతే 'చిన్ను పప్పు'గా సోషల్ మీడియాలో ఆమెకు మంచి గుర్తింపు ఉంది. ముఖ్యంగా ఇన్‌స్టాగ్రామ్‌లో 2 లక్షలకు పైగా ఫాలోవర్లు ఉన్నారు. కాసర్కోడ్ స్థానిక భాషా మాండలికంలో ఆమె చేసే వీడియోలకు విపరీతమైన క్రేజ్ ఉంది. స్థానిక వంటకాలు, భోజనం, ఆ ప్రాంత సంస్కృతిని ప్రతిబింబించేలా ఆమె చేసే వీడియోలు వైరల్ అయ్యేవి. లక్షలాది మంది నెటిజన్లు ఆమె వీడియోలను వీక్షించేవారు. రేష్మ మరణానికి గల కారణాలు ఇంకా స్పష్టంగా తెలియరాలేదు. అయితే, పోలీసులు ప్రాథమికంగా సేకరించిన సమాచారం ప్రకారం.. ఆమెకు నాలుగేళ్ల కుమారుడు ఉన్నాడు. కేవలం నెల రోజుల క్రితమే ఆమె విడాకులు తీసుకున్నట్లు సమాచారం. విడాకుల అనంతరం తలెత్తిన మనస్తాపం లేదా వ్యక్తిగత కారణాలేమైనా ఈ ఆత్మహత్యకు దారితీశాయా అనే కోణంలో పోలీసులు విచారణ జరుపుతున్నారు. ఆదూర్ పోలీసులు కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో నూ దర్యాప్తును ముమ్మరం చేశారు.

'మియాన్ ముస్లిం' వంటి రెచ్చగొట్టే ప్రకటనలను నిషేధించాలి.. యోగి సహా బీజేపీ సీఎంలపై సుప్రీంకోర్టులో పిటిషన్

మియా ముస్లిం', 'కథా ముల్లా', 'వరద జిహాద్' వంటి రెచ్చగొట్టే, విభజనాత్మక పదాలను బహిరంగ వేదికలపై ఉపయోగించడాన్ని నిషేధించాలని కోరుతూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిస్వా శర్మ, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి సహా పలువురు బీజేపీ ముఖ్యమంత్రులు, నేతల వ్యాఖ్యలపై ఈ పిటిషన్ దాఖలైంది. పిటిషన్‌లో పేర్కొన్న వివరాల ప్రకారం, ఇలాంటి పదాలను ఉపయోగించడం రాజ్యాంగ పదవులు నిర్వహిస్తున్న వ్యక్తుల బాధ్యతలకు విరుద్ధమని, ఇది సమాజంలో విభజన, భయం, ఉద్రిక్తతలను పెంచుతోందని ఆరోపించారు. ముఖ్యంగా మతపరమైన సమూహాలను లక్ష్యంగా చేసుకుని చేసే వ్యాఖ్యలు సామాజిక సమరసతకు ముప్పుగా మారుతున్నాయని పిటిషనర్లు పేర్కొన్నారు. అస్సాం సీఎం హిమంత బిస్వా శర్మ చేసిన 'మియా ముస్లిం', 'వరద జిహాద్' వ్యాఖ్యలు, ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ ఉపయోగించిన 'కథా ముల్లా' పదం, ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్ సింగ్ ధామి చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు, బీజేపీ నేత నితేష్ రాణే ముస్లింలను "పాకిస్తానీ పింప్స్"గా సంబోధించిన వ్యాఖ్యలను పిటిషనర్లు తీవ్రంగా వ్యతిరేకించారు.

ఈ పిటిషన్‌లో జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ చేసిన ఒక వ్యాఖ్యను కూడా ప్రస్తావించారు. చరిత్రపై ప్రతీకారం తీర్చుకునేలా యువతను ప్రేరేపించే వ్యాఖ్యలు సమాజంలో అశాంతిని పెంచుతాయని పిటిషనర్లు కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. ఢిల్లీ మాజీ లెఫ్టినెంట్ గవర్నర్ నజీబ్ జంగ్, సామాజిక కార్యకర్తలు జాన్ దయాల్, రూప్ రేఖ వర్మ సహా మొత్తం 12 మంది సామాజిక కార్యకర్తలు ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు. రాజ్యాంగ పదవుల్లో ఉన్నవారు విభజనాత్మక వ్యాఖ్యలు చేయకుండా నిరోధించేందుకు స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేయాలని వారు సుప్రీంకోర్టును కోరారు. అలాగే, ఓటరు జాబితాల నుంచి మతపరమైన సమాజాలకు చెందిన వారిని తొలగించాలనే డిమాండ్లు రాజ్యాంగ విరుద్ధమని కూడా పిటిషన్‌లో పేర్కొన్నారు.

రైల్వే ప్రయాణికులకు గుడ్‌న్యూస్.. మరో సర్వీస్ ప్రారంభించిన IRCTC

- **భారతీయ రైల్వే ప్రయాణికులకు శుభవార్త..**
- **మెయిల్ మరియు ఎక్స్‌ప్రెస్ రైళ్లలో ప్రయాణించే ప్రయాణికుల కోసం..**

భారతీయ రైల్వే ప్రయాణికులకు శుభవార్త.. ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ (IRCTC) మెయిల్ మరియు ఎక్స్‌ప్రెస్ రైళ్లలో ప్రయాణించే ప్రయాణికుల కోసం 'ఈప్యాంట్రీ' సేవను ప్రారంభించింది. ఈ సేవ ద్వారా ప్రయాణికులు తమ సీట్లను వదిలి వెళ్లే అవసరం లేకుండానే.. వారి బర్త్ దగ్గరకే శుభ్రమైన, వేడి ఆహారం మరియు ప్యాకేజ్డ్ వాటర్‌ను ముందుగానే బుక్ చేసుకుని పొందవచ్చు. ఇంతకుముందు ఆన్‌లైన్ ఫుడ్ బుకింగ్ సౌకర్యం ప్రీమియం రైళ్లకే పరిమితమై ఉండగా, తాజాగా ఈ సేవను 25 మెయిల్ మరియు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు విస్తరించారు. టికెట్‌లో భోజనం చేర్చబడని రైళ్లలో ప్రయాణించే వారికి ఈ సేవ ఎంతో ఉపయోగకరంగా ఉండనుంది.

ఈ-ప్యాంట్రీ సేవ ఎలా పనిచేస్తుంది?

ఈప్యాంట్రీ సేవ IRCTC వెబ్‌సైట్ మరియు మొబైల్ యాప్‌తో అనుసంధానించబడి ఉంటుంది. ధృవీకరించబడిన, RAC లేదా పాక్షికంగా ధృవీకరించబడిన టిక్కెట్లు ఉన్న ప్రయాణికులు బుకింగ్ సమయంలో లేదా తరువాత విభాగంలోకి వెళ్లి ప్రామాణిక భోజనం లేదా 'రైల్ నీర్' ప్యాకేజ్డ్ వాటర్‌ను ముందస్తుగా ఆర్డర్ చేయవచ్చు. ఆర్డర్ చేసిన తర్వాత ప్రయాణికులకు SMS లేదా ఇమెయిల్ ద్వారా నిర్ధారణ సందేశంతో పాటు పంపబడుతుంది. ప్రయాణ రోజున రైలులో ఉన్న విక్రేతకు ఈ MVC చూపిస్తే, ఆహారం నేరుగా ప్రయాణికుల సీటుకు డెలివరీ చేయబడుతుంది.

ఈ రైళ్లలో ఈ-ప్యాంట్రీ సేవ అందుబాటులో ఉంది

ప్రయోగాత్మకంగా వివేక్ ఎక్స్‌ప్రెస్ (22503/04)లో ప్రారంభించిన ఈ సేవకు మంచి స్పందన లభించడంతో ఇప్పుడు పలు రైళ్లకు విస్తరించారు.

బంగ్లాదేశ్ లో తిరిగి పుంజుకున్న అల్లర్లు – మతహింసా? రాజకీయ వైఫల్యమా? ప్రాంతీయ ప్రమాదమా?

బంగ్లాదేశ్‌లో ఇటీవల జరుగుతున్న పరిణామాలు దక్షిణాసియాలోని ప్రజాస్వామ్య భవిష్యత్తుపై, మైనార్టీల భద్రతపై, పొరుగుదేశాల మధ్య నమ్మకంపై తీవ్రమైన ప్రశ్నలు వస్తున్నాయి. అధికార మార్పుల తరువాత రాజకీయ అశాంతి పెరగడం కొత్త కాదు. కానీ ఆ అశాంతి ఒకే మతానికి చెందిన ప్రజలను లక్ష్యంగా చేసుకుని వరుస హింసాత్మక దాడులుగా మారినప్పుడు, అది కేవలం "రాజకీయ హింస" అనే సాధారణ వివరణకు సరిపోదు. బంగ్లాదేశ్‌లో హిందువులు, క్రైస్తవులు, బౌద్ధులు వంటి మైనార్టీలపై జరుగుతున్న దాడులు అలాంటి ఆందోళనకర స్థాయికి చేరుకున్నాయి.

హసీనా ప్రభుత్వం పతనం అనంతరం తాత్కాలిక ప్రభుత్వ పాలనలో దేశం రాజకీయంగా స్థిరత్వాన్ని కోల్పోయింది. ఈ ఖాళీని తీవ్రవాద భావజాలం, మూకల హింస, స్థానిక రాజకీయ శక్తులు కలిసి ప్రమాదకర పరిస్థితులను సృష్టిస్తున్నట్లు కనిపిస్తోంది. ప్రత్యేకంగా హిందూ మైనార్టీలపై వరుస దాడులు, హత్యలు, దహనాలు, భూ కబ్జాలు జరగడం కేవలం యాదృచ్ఛికం కాదనే అభిప్రాయం బలపడుతోంది. స్వతంత్ర వర్గాల అంచనాల ప్రకారం తాత్కాలిక ప్రభుత్వ కాలంలోనే 2,900కు పైగా హింసాత్మక సంఘటనలు మైనార్టీలను లక్ష్యంగా చేసుకున్నాయంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు.

ప్రతి హత్య వెనుకాల "మతపరమైన కోణం లేదు" అని అధికారిక ప్రకటనలు రావడం, కానీ అదే సమయంలో దాడుల సరళి మాత్రం మైనార్టీలపైనే కేంద్రీకృతమై ఉండడం ప్రభుత్వ విశ్వసనీయతపై సందేహాలు కలిగిస్తోంది. ఒక దేశంలో చట్టవ్యవస్థ బలంగా ఉంటే, మూకలు రెచ్చిపోవు.అయినా అవి రెచ్చిపోతున్నాయంటే అది పాలనా వైఫల్యానికి నిదర్శనం. ప్రేక్షకపాత్ర వహించే ప్రభుత్వం కూడా హింసకు పరోక్ష బాధ్యత వహించాల్సిందే అన్నది ఆధునిక రాజకీయ సిద్ధాంతం చెబుతున్న సత్యం.

బంగ్లాదేశ్‌లో హిందువుల సంఖ్య సుమారు రెండు కోట్లకు చేరువలో ఉంది. చరిత్రపరంగా వారు ఆ దేశ సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక జీవితంలో భాగమే. 1971 విముక్తి ఉద్యమం నుంచి ఇప్పటివరకు ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొన్నప్పటికీ, ఇలాంటి విస్తృత స్థాయి లక్ష్యల దాడులు దేశపు బహుళత్వ భావనను కుదిపేస్తున్నాయి. మైనార్టీలపై దాడులు పెరిగితే, అవి దేశ అంతర్గత సమస్యగానే ఉండవు. అవి ప్రాంతీయ అస్థిరతకు దారి తీస్తాయి. శరణార్థుల ప్రవాహం, సరిహద్దు ఉద్రిక్తతలు, తీవ్రవాద శక్తులకు అవకాశాలు... ఇవన్నీ సహజ పరిణామాలు.

భారత్ స్పందన ఈ సందర్భంలో ప్రాముఖ్యత సంతరించుకుంది. విదేశాంగ మంత్రిత్వశాఖ చేసిన ప్రకటనలు, మైనార్టీలపై హింసను విస్మరించలేమని చెప్పడం దౌత్యపరంగా కీలకం. ఇది కేవలం మత పరమైన అనుబంధం వల్ల కాదు. పొరుగుదేశంలో శాంతిభద్రతలు క్షీణిస్తే భారత్ భద్రత, ఆర్థిక ప్రయోజనాలు కూడా ప్రభావితమవుతాయి. అయినప్పటికీ, మాటలకే పరిమితమవ్వడం సరిపోదు. అంతర్జాతీయ వేదికలపై మానవ హక్కుల అంశాన్ని లేవనెత్తడం, బంగ్లాదేశ్ ప్రభుత్వంపై బాధ్యతాయుత చర్యలకు ఒత్తిడి తెచ్చే దౌత్యం అవసరం.

ప్రపంచం మరో కోణంలో కూడా ఈ పరిస్థితిని గమనిస్తోంది. గాజా, ఉక్రెయిన్ వంటి అంతర్జాతీయ సంక్షోభాలపై భావోద్వేగ స్పందనలు చూపిన సమాజం, పొరుగుదేశంలో జరుగుతున్న మైనార్టీ హింసపై మౌనం పాటించడం ద్వంద్వ వైఖరిని బయటపెడుతోంది. మానవ హక్కులు భౌగోళిక సరిహద్దులకు పరిమితం కావు. ఒక ప్రాంతంలో జరిగే అన్యాయంపై మౌనం, మరొక ప్రాంతంలో నీతిపరమైన ప్రసంగాలు ఇవి నైతిక విశ్వసనీయతను దెబ్బతీస్తాయి.

బంగ్లాదేశ్‌లో జరుగుతున్నది కేవలం మత ద్వేషమే కాదు. అది రాజకీయ శూన్యత, ఆర్థిక అసమానతలు, తీవ్రవాద భావజాలం కలిసి సృష్టించిన విషపూరిత మిశ్రమం. అధికార పోరాటాల్లో మైనార్టీలు సులభ లక్ష్యాలవుతారు అన్నది దక్షిణాసియా చరిత్రలో కొత్త విషయం కాదు. కానీ అదే చరిత్ర చెబుతున్న పాఠం ఏమిటంటే... మైనార్టీల భద్రతను విస్మరించిన దేశాలు చివరకు మెజారిటీ ప్రజలకూ శాంతిని ఇవ్వలేకపోయాయి.

తాత్కాలిక ప్రభుత్వం నిజంగా దేశాన్ని స్థిరపర్చాలనుకుంటే, ముందుగా మైనార్టీలపై జరుగుతున్న హింసను ఆపాలి. స్పష్టమైన చర్యలు, వేగవంతమైన న్యాయ ప్రక్రియ, దోషులకు కఠిన శిక్షలు ఇవి లేకుండా ఇచ్చే ప్రకటనలు విలువలేనివే. రాజకీయ హింస పేరుతో మతపరమైన దాడులను కప్పిపుచ్చే ప్రయత్నం దేశాన్ని మరింత ప్రమాదంలోకి నెట్టుతుంది.

ఈ పరిణామాలు భారత్‌కూ ఒక హెచ్చరికే. పొరుగుదేశాల్లో ప్రజాస్వామ్యం బలహీనపడితే, అది సరిహద్దులు దాటి ప్రభావం చూపుతుంది. కాబట్టి భావోద్వేగ ఆగ్రహం కంటే వ్యూహాత్మక, మానవతావాద దౌత్యం అవసరం. అదే సమయంలో పౌర సమాజం, మేధావులు, కళాకారులు మౌనం వీడి మాట్లాడటం కూడా కీలకం. ఎందుకంటే మౌనం ఎప్పుడూ బాధితుల పక్షాన ఉండదు. చాలాసార్లు అది హింసకు తోడ్పాటే అవుతుంది.

బంగ్లాదేశ్ ఈ దశలో ఒక కీలక మలుపులో ఉంది. బహుళత్వాన్ని కాపాడుకుంటుందా, లేక మూకల రాజకీయాలకు లొంగిపోతుందా అన్న ప్రశ్నకు సమాధానం అక్కడి పాలకుల చేతుల్లో మాత్రమే కాదు, ప్రాంతీయ సమాజాల జాగ్రత్తలో కూడా ఉంది. మైనార్టీల భద్రత అనేది దయాదాక్షిణ్యం కాదు. అది ప్రజాస్వామ్యానికి లిట్మస్ పరీక్ష. ఆ పరీక్షలో విఫలమైతే, దాని మూల్యం దేశమే కాదు, మొత్తం ప్రాంతం చెల్లించాల్సి వస్తుంది.

డాక్టర్.కోలాహలం రామ్ కిశోర్
.9849328496.

ఏపీలో రాజకీయం ఎటు పోతోంది..?
దాడుల సంస్కృతికి కారణమేంటి..?

ఏపీలో రాజకీయం సరికొత్త లోతులకు దిగజారుతోంది. అధికారం మారితే.. ఇన్నాళ్లూ కొన్ని ప్రాంతాల్లో ఊళ్లకు ఊళ్లు ఖాళీ అయిపోవడం.. మరికొన్ని ప్రాంతాల్లో ఓ వర్గం మరో వర్గం కంటపడకుండా అజ్ఞాతంలోకి వెళ్లడం రాష్ట్రానికి ఎప్పట్నుంచో అనుభవమే. కానీ ఇప్పుడు కొత్తగా రాష్ట్రవ్యాప్తంగా ప్రతిపక్షంలో ఉన్నవారెవరికీ రక్షణ ఉండదని తేలిపోయింది. వైసీపీ హయాంలో ఓ నేత ఏకంగా మాజీ సీఎం నివాసంపైకి దూసుకెళ్లడం కలకలం రేపింది. జడ్ ప్లస్ క్యాటగిరీలో ఉన్న వ్యక్తి మీదకు అలా మందగా వెళ్లడం ఏంటని అప్పట్లో చర్చ జరిగింది. ఇప్పుడు టీడీపీ హయాంలో కొందరు నేతల్ని టార్గెట్ చేసి దాడులు చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఏకంగా రాజకీయ ప్రత్యర్థులుగా ఉన్న నేతల ఇళ్లపై దాడులు జరగటం.. వారి కుటుంబ సభ్యుల్నీ టార్గెట్ చేయడం చర్చనీయాంశమైంది. మొత్తం మీద విభజనతో ఎన్నో సమస్యలు చుట్టుకున్న ఏపీని ప్రధాన పార్టీలు.. గట్టెక్కించకపోగా.. తమ రాజకీయం కోసం సరికొత్త సమస్యను తెచ్చిపెట్టారనే వాదన తెరపైకి వచ్చింది. ఇదే అంశంపై ఇవాల్టి చైర్మన్స్ డెస్క్ చూద్దాం.

కొన్నేళ్లుగా ఏపీలో కొత్త సంస్కృతి మొదలైంది. రాజకీయ ప్రత్యర్థుల ఇళ్లపై దాడులు,ఆస్తులు విధ్వంసం చేయడం, భయానక వాతావరణాన్ని సృష్టించడాన్ని ప్రధాన పార్టీలు అలవాటుగా మార్చుకున్నాయి. రాష్ట్రంలో ప్రధాన పార్టీలన్నీ ఇందుకు బాధ్యులే. అంబటి రాంబాబు, జోగి రమేష్ ఇళ్లపై వందలమంది మూకుమ్మడిగా దాడి చేయడం, తగలబెట్టడం ఇవన్నీ చూస్తే ఎలాంటి ఆంధ్రప్రదేశ్.. ఎలా మారిపోయింది అనిపిస్తుంది. బీహార్ సంస్కృతి గురించి చెప్పుకోవడం వినడమే మనకు తెలుసు. కానీ అదిప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో ప్రత్యక్షంగా కనిపిస్తోంది. వైసీపీ ఐదేళ్ల పాలనలో ఇలాంటి దృశ్యాలు కొన్ని చూశాం. ఇప్పుడు అదే ప్రతీకార రాజకీయం కొనసాగుతోంది. జగన్ సర్కార్ విచ్చలవిడితనం, పొరపాట్లు, అరాచకాల వల్లే జనం వాళ్లని 11 సీట్లకు పరిమితం చేశారు. ప్రజలు కోలుకోలేని తీర్పు ఇచ్చారు. తగిన గుణపాఠం నేర్పారు. కూటమి సర్కార్‌కు అందుకే అధికారం కట్టబెట్టారు. కానీ ఇప్పుడు చంద్రబాబు సర్కార్ కూడా అదే పొరపాటు చేస్తోంది. అదే అరాచకం సృష్టిస్తోంది. అదే ప్రతీకార రాజకీయాలకు తెగబడుతోంది. ప్రజలు ఏం కోరుకుని కూటమికి అధికారం కట్టబెట్టారో దానికి విరుద్ధంగా ప్రభుత్వం వెళ్తోంది.

ఏ రాష్ట్రంలో అయినా శాంతిభద్రతల పరిరక్షణే ప్రభుత్వాల తక్షణ కర్తవ్యం. అంతేకానీ రాజకీయ ప్రతీకారాలు తీర్చుకోమని ఏ రాష్ట్ర ప్రజలూ ఎవ్వరికీ అధికారం ఇవ్వరు. ఈ సంగతి ఏపీలో ప్రధాన పార్టీలకు ఇసుమంతైనా గుర్తుందా అంటే లేదనే చెప్పాలి. ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం అనే విషయాన్నే మర్చిపోయిన ఏపీ పార్టీలు.. ఎవరు అధికారంలోకి వచ్చినా.. తమ క్యాడర్ మనోభావాలు గౌరవించడం, వారి ప్రతీకారాలకు సహకరించడమే విద్యుక్త ధర్మంగా పనిచేస్తున్నాయి. అంతకుమించి ఆలోచించటానికి కూడా ఏ పార్టీకీ మనసు రావడం లేదు. పోనీ ప్రతీకారమైనా పద్ధతిగా తీర్చుకుంటున్నారా అంటే అదీ లేదు. రోజులు గడిచేకొద్దీ ప్రతీకారం పీక్‌స్‌కు వెళ్లి.. మధ్యయుగం నాటి దాడుల దాకా వెళ్లిపోతోంది. కాసేపు ప్రతీకారాల గురించి పక్కన పెడితే.. ప్రత్యక్షంగా ఆ దాడులు చూసిన సాధారణ ప్రజలు భయభ్రాంతులకు గురయ్యే దుస్థితి ఉంది. వాళ్లూ వాళ్లూ కొట్టుకుని ఎక్కడ తమ మీద పడతారో అని.. చుట్టుపక్కల ప్రజలు దాడులు జరిగినంతసేపూ ప్రాణాలు అరచేతిలో పట్టుకుని క్షణం ఒక యుగంగా బతికారంటే నమ్మాల్సిందే. కావాలని చేయకపోయినా.. పైశాచిక స్థాయిలో దాడులు జరుగుతున్నప్పుడు.. పొరపాట్లు, గ్రహపాట్లు సహజం. అలాంటి పొరపాటో, గ్రహపాటో జరిగి ఏ సంబంధం లేని వారిపై దాడులు జరగవని, వారికి హాని ఉండదని ఎవ్వరూ గ్యారంటీ ఇవ్వలేరు. ఇక మూక మనస్తత్వం గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. ఒంటరిగా బుద్ధిగా ఉండేవారు కూడా.. గుంపులో ఉన్నప్పుడు వింతగా ప్రవర్తించడం మామూలే. అలాంటి అనూహ్య ప్రవర్తనలు.. ఎప్పుడు ఎవరికి హాని చేస్తాయో ఎవరూ చెప్పలేరు. కానీ ఏపీలో ప్రతీకార దాహంతో రగిలిపోతున్న ప్రధాన పార్టీలకు.. ప్రజలు.. వారి క్షేమం గురించిన ఆలోచనే లేకపోవడం రాష్ట్రం దురదృష్టం అనుకుని సరిపెట్టుకోవాల్సిన దుస్థితి.

అలాగని ఉమ్మడి ఏపీలో ప్రతీకారాలు అసలు లేవని కాదు. అప్పట్లోనూ ప్రతీకారాలున్నా.. అవి ఓ పరిమితికి లోబడి.. ఓ పద్ధతిగా ఉండేవి. ప్రత్యర్థుల్ని రాజకీయంగా తొక్కేయటం, వారి ఆర్థిక మూలాలపై దెబ్బకొట్టడం లాంటివి సాధారణమే. కానీ ఏకంగా భౌతిక దాడులకు దిగటం, అసలు శాల్తీలే గల్లంతు చేయాలనే స్థాయి దిగజారుడు రాజకీయం మునుపెన్నడూ లేదు. అయితే రాజకీయ ప్రతీకారం ఒక్కసారిగా ఈ స్థాయికి దిగజారలేదు. మొదట బూతుల సంస్కృతి విచ్చలవిడిగా రాజ్యం చేసింది. బూతులు మాట్లాడేవాడే మొనగాడనే ట్రెండ్ సెట్ అయింది. ఆ తర్వాత నేతలతో పాటు వారి కుటుంబాల్నీ బజారుకు లాగే నీచ సంస్కృతి పురుడు పోసుకుంది. రాజకీయాల్లో ఉన్న పాపానికి.. మీతో పాటు మీ కుటుంబం మీద బురద జల్లుతాం.. చచ్చినట్టు కడుక్కోవాల్సిందే అనే ధోరణి వచ్చేసింది. చివరకు కాస్త మర్యాదస్తులెవరైనా రాజకీయాల్లోకి రావాలంటే భయపడే పరిస్థితి తీసుకొచ్చారు. ఈ కారణంగానే కొందరు మంచి నేపథ్యం ఉన్న రాజకీయానికి దూరంగా ఉంటున్నారనేది బహిరంగ రహస్యం. ఎప్పుడైతే రాజకీయాల్లోకి వీధి రౌడీలు, గూండాల భాష వచ్చేసిందో.. అదే రాజ్యం చేయడం మొదలుపెట్టిందో.. ఎప్పుడైతే అధికారం కోసం ఏం చేసినా తప్పు కాదనే ధోరణి ప్రబలిందో.. ఎప్పుడైతే అధికారాన్ని సుస్థిరం చేసుకోవటానికి ప్రత్యర్థులు లేకుండా చేయాలనే దురాలోచన మొగ్గ తొడిగిందో.. అప్పుడే రాజకీయాల్లో అన్ని రకాల విలువలూ పతనమయ్యాయి. అసలు రాజకీయానికి ఉన్న ప్రాథమిక నియమాలన్నీ గంగలో కలిసిపోయాయి. ముఖ్యంగా ఏపీలో ప్రధాన పార్టీలన్నీ కలిసి.. రాజకీయాన్ని కొత్తగా ఆవిష్కరించాయి. దేశంలోని మిగతా రాష్ట్రాల రాజకీయానికీ.. తమకూ తేడా ఉండాలనే దుగ్ధతో పరమ నైచ్యానికి తెగబడ్డాయి. అందుకే రాజకీయం విష సంస్కృతిగా మారిపోయింది. రాజకీయ నేతల్ని చూసి జనం భయపడే పరిస్థితి వచ్చింది. ఏపీలో రాజుకున్న రాజకీయ నైచ్యానిక ఇకనైనా ముగింపు పలకపోతే.. రాబోయే రోజుల్లో బీహార్ ప్రజలు కూడా మీ కంటే మీరే నయం అని బహిరంగంగా కామెంట్ చేసే పరిస్థితి ఎంతోదూరంలో ఉండకపోవచ్చు. ఏతావాతా ఏపీకి అన్నపూర్ణగా ఉన్నపేరు పోగొట్టేసి.. ఏపీ అంటే దాడులు, బూతులే అని చెప్పాల్సిందేనని నేతలు కంకణం కట్టుకున్న దుస్థితి కళ్ల ముందే కనిపిస్తోంది.

రాజకీయ చైతన్యానికి పెట్టింది పేరైన ఏపీలో.. ఇలాంటి రాజకీయం జరుగుతుందని ఎవరూ ఎప్పుడూ అనుకోలేదు. చివరకు బూతులు తిట్టుకుంటున్నప్పుడు కూడా ఇంతకుమించి దిగజారరులే అని సరిపెట్టుకున్నారు. కానీ ఏపీ నేతలు మాత్రం ఎప్పటికప్పుడు సరికొత్త లోతులకు దిగజారుతూ.. దిగజారుడుతనానికి కొత్త కొలబద్దను వెతుక్కోవాలని అందరికీ సవాల్ విసురుతున్నారు.

రాజకీయం చేయడం అంటే ప్రతీకారం తీర్చుకోవడమే.. అనే సిద్ధాంతాన్ని జనంలోకి కార్యకర్తల్లోకి నాయకుల్లోకి బలంగా ఎక్కిస్తున్నాయి ఏపీ పార్టీలు. ఏ విష సంస్కృతికి వ్యతిరేకంగా జనం ఓటు వేశారో.. ఏపీలో అదే విషసంస్కృతిని తిరిగి పెంచి పోషిస్తున్నారు. అధికారం వస్తే అందరూ ఒకటే ... ఇలాగే ఉంటారు .. అని స్పష్టంగా చెబుతున్నట్టు ఉంది పరిస్థితి. రాష్ట్రవిభజన జరిగి 12 ఏళ్లు అయింది. రాజధాని లేదు. ఉద్యోగాల్లేవు. పరిశ్రమల్లేవు. విద్యాసంస్థలు లేవు. ఎవరి అజెండా వారిదే. అవన్నీ గాలికొదిలేసి ఒకరిపై ఒకరు తెగబడి నరుక్కోవడం, కొట్టుకోవడం, ఇళ్లు తగలబెట్టుకోవడం.. ఇదేం సంస్కృతి? ఏపీ ఎటుపోతోంది? . ఇదే ప్రతీకార రాజకీయాలు , పరస్పర దాడులు కొనసాగితే.. మరో మూడేళ్ల తర్వాత అధికార మార్పిడి జరిగితే.. పరిస్థితి ఏమిటి ? అప్పుడు నైతికంగా వీళ్లని ఖండించే హక్కు ఉంటుందా ? అప్పుడు మీరు చేశారు కాబట్టి.. ఇప్పుడు మేం చేశాం.. అనే వాదన కొనసాగుతూనే ఉంటుంది. దీనికి ఎక్కడోచోట ఫుల్‌స్టాప్ పెట్టాలి. పార్టీ శ్రేణులు పిచ్చెత్తిపోయినట్టు మూకలు మూకలుగా తెగబడి దాడులు చేస్తుంటే చూడ్డానికి 70mm సినిమాలా బానే ఉంటుంది. కానీ దాని పర్యవసానాలు ఎందరుణంగా ఉంటాయో ఆ కార్యకర్తల కుటుంబాలకే తెలుసు. నాయకులు ఎప్పుడూ ఏసీ గదుల్లో క్షేమంగానే ఉంటారు. వీళ్లంతా జైళ్లలో మగ్గిపోతూ కోర్టుల చుట్టూ తిరుగుతూ ఉంటారు. ఫైనల్‌గా సాధించేది ఏమీ ఉండదు. ఓ కుటుంబానికో , ఓ వ్యక్తికో రాజ్యాధికారాన్ని కట్టబెట్టడం తప్ప.

మనం మధ్యయుగంలో లేం. ఇది ప్రజాస్వామ్య యుగం. ఇక్కడ వీధిపోరాటాలు, యుద్ధాలకు తావు లేదు. ఏమున్నా ప్రజల దగ్గరకు వెళ్లి తేల్చుకోవాలి. ఎన్నికల్లో గెలుపోటములే గీటురాయి. అంతేకానీ ఎవరు బాగా దాడి చేస్తే.. ఎవరు ఎక్కువగా బూతులు తిడితే వారు గెలిచినట్టు ప్రకటించే విధానాలు ఏమీ లేవు. ఈ సంగతి ఏపీలో ప్రధాన పార్టీలకూ తెలుసు. కానీ అన్నీ తెలిసీ పనిగట్టుకుని బరితెగించి రోడ్డున పడటం ఏంటో ఎవరికీ అర్థం కావడం లేదు. అసలు ప్రస్తుత పరిస్థితుల్లో ఏపీలో పార్టీలు చాలా బాధ్యతాయుతంగా ప్రవర్తించాలి. ఇంకా గట్టిగా చెప్పాలంటే ఒళ్లు దగ్గర పెట్టుకోవాలి. ఎందుకంటే ఏపీ చాలా కష్టాల్లో ఉంది. ఒక్కో సమస్యను పరిష్కరిస్తూ.. రాష్ట్రాన్ని కష్టాల సుడిగుండం నుంచి బయటకు తేవాలి. అందుకోసం ఓ స్పష్టమైన కార్యాచరణ తీసుకుని.. రాజకీయాలకు అతీతంగా ముందుకెళ్లాలి. ఇప్పటికే ఏపీకి ఉన్న సమస్యల చిట్టా ఏంటో.. ప్రధాన పార్టీలు పోటాపోటీగానే చెబుతున్నాయి. మరి పరిస్థితి అలా ఉంటే.. మీరెలా ఉండాలనే నైతిక ప్రశ్న వేసుకోవటానికి మాత్రం ఎవరూ సిద్ధంగా లేకపోవడమే ఇక్కడ అసలైన చోద్యం. అప్పటికీ ఏపీ ప్రజలు తమ దగ్గరున్న ప్రత్యామ్నాయాలన్నీ ఉపయోగించారు. ఒకరు కాకపోతే మరొకరైనా రాష్ట్రాన్ని గట్టెక్కిస్తారని, తమకు మంచి భవిష్యత్తు ఇస్తారని ఆశతో ఐదేళ్లకోసారి అధికారమార్పిడి కూడా చేశారు. కానీ ఏం చేసినా వారి ఆశలన్నీ అడియాసలే అయ్యాయి. అతని కంటే ఘనుడు ఆచంట మల్లన్న అనే తరహాలో ప్రధాన పార్టీలు పోటీపడి అరాచకానికి తెరలేపుతున్నాయి. పాలన సంగతి వదిలేసి.. రాజకీయ ప్రత్యర్థుల్ని వేటాడటమే పనిగా పెట్టుకున్నాయి. ఇప్పటికే రేపు వచ్చే ఎన్నికల్లో అధికార మార్పిడి జరిగితే.. ఎలా ప్రతీకారం తీర్చుకోవాలనే కార్యాచరణ తయారుగా ఉండంటే అతిశయోక్తి కానే కాదు.

ప్రతీకార రాజకీయాల కోసం ఈ స్థాయిలో ఆలోచిస్తున్న పార్టీలు, నేతలు.. ఏపీ అభివృద్ధి గురించి ఎందుకు ఆలోచించడం లేదో ఎవరికి వారు ఆత్మవిమర్శ చేసుకోవాలి. కానీ ఇప్పుడున్న స్థితిలో ముల్లుకర్ర పెట్టి పొడిచినా ఏపీలో పార్టీలకు చీమ కుట్టినట్టైనా ఉంటుందా అంటే సందేహమే. ఆ స్థాయిలో పార్టీల తోలు మందమైపోయింది. ఏపీలో ప్రధాన పార్టీల తీరు చూస్తుంటే కొత్త అనుమానాలు పుట్టుకొస్తున్నాయి. ఎలాగూ ఏపీ అభివృద్ధి అంత తేలిక కాదు కాబట్టి.. అరాచక సంస్కృతికి తెరలేపటం తేలికని ఈ రూట్ ఎంచుకున్నారా అనేది తేలాల్సి ఉంది. ప్రజలు కూడా పదేపదే అభివృద్ధి గురించి, సమస్యల గురించి అడగకుండా ఉండాలంటే.. వారి సాధారణ జీవనాన్ని డిస్టర్బ్ చేయాలనేది ఏమైనా లక్ష్యంగా పెట్టుకున్నారా అనిపిస్తోంది. కాదు కాదు అలా అనిపించేలా ఏపీ పార్టీలే చేస్తున్నాయి. ఏ పార్టీ అధికారంలో ఉన్నా.. రాజకీయ ప్రత్యర్థులు లేకుండా చేయాలనుకునే పోకడలు ఎటు దారితీస్తాయో ఎవరికీ అర్థం కావడం లేదు. కొంతమందైతే ఈ పెడదారులకు ప్రజలే అడ్డుకట్ట వేయాలని అని చెబుతున్నారు. కానీ ప్రజలకు కేవలం ఎన్నికల్లో మాత్రమే అవకాశం ఉంటుంది. పైగా ప్రధాన పార్టీలన్నీ అదే బాటలో ఉన్నప్పుడు.. ఇక ఎవర్ని ఎన్నుకున్నా ఉపయోగం ఏముందనే కొత్త ప్రశ్నలు దూసుకొస్తున్నాయి. చివరకు ఏపీ ప్రజలు మీరు మమ్మల్ని ఉద్ధరించకపోయినా పర్లేదు.. మరింత అధ్వాన్న స్థితికి దిగజార్చొద్దని పార్టీలకు మొర పెట్టుకునేలా రాజకీయం దిగజారుతోంది. అధికారం శాశ్వతం కాదని తెలిసీ, చివరకు మొదటిసారి ఎన్నికల్లో గెలిచినవారు కూడా కనీస స్పృహ లేకుండా నోటికి, చేతులకు పని చెబుతున్నారంటే ఎవర్ని ఏమనాలో తెలియని దుస్థితి.

మొత్తం మీద రాజకీయానికే కొత్త అర్థం చెబుతున్న ఏపీ నేతల్ని చూసి.. మిగతా రాష్ట్రాల నేతలు కూడా అనుసరిస్తే ఏం జరుగుతుందో ఊహించటానికే భయమేస్తోంది. ప్రగతిశీల రాజకీయాలు చేసే ఏపీ నేతల్ని ఇప్పటిదాకా చూసిన ప్రజలకు.. కొత్తగా అరాచకమే కేరాఫ్ అడ్రస్‌గా తయారైన నేతల్ని చూసి మతిపోతోంది. ఈ దుస్థితి ఇలాగే కొనసాగితే కొత్త పెట్టుబడులు రాకపోగా.. ఉన్న కంపెనీలు కూడా వెళ్లిపోతాయేమోననే ఆందోళన నెలకొంది. ఏపీలో రాజకీయ పార్టీలు ఎప్పటికి మారతాయనేది ఎవరికీ అంతుచిక్కటం లేదు. ఏపీలో రోజురోజుకీ దిగజారుతున్న రాజకీయం.. అంతకంతకూ రెచ్చిపోతున్న పార్టీల పోకడలు.. కచ్చితంగా ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధికి చిరునామాగా చేయాల్సిన నేతలు.. పని గట్టుకుని రాష్ట్రం పరువు తీయాలని లక్ష్యంగా పెట్టుకోవడం.. సాధారణ ప్రజలకు తలబొప్పి కట్టిస్తోంది.

రాజకీయమన్నాక ప్రత్యర్థులు ఉంటారు. ఉండాలి. ఆరోగ్యకరమైన ప్రజాస్వామ్యానికి బలమైన ప్రతిపక్షమే పునాది అని ఎప్పుడో చెప్పారు. కానీ ఏపీలో ప్రధాన పార్టీలు మాత్రం అలా అనుకోవడం లేదు. ఉంటే మేమే ఉండాలి. మరొకరి అస్తిత్వమే ఉండొద్దనే ధోరణితో చెలరేగిపోతున్నాయి. ఇప్పటికే విజయవంతంగా ఏపీ సమాజాన్ని కులాల వారీగా, పార్టీల వారీగా విభజించిన నేతలు.. తటస్థులు అనేవారు ఎవరూ ఉండకూడదనే విధంగా వ్యవహరిస్తున్నారు. ఆ గట్టునుంటావా.. ఈ గట్టునుంటావా.. ఎటో తేల్చుకో అని అల్టిమేటం ఇస్తున్నారు. ఇంకా బరితెగించి తటస్థుల మీదా ఏదో ఒక పార్టీ ముద్ర వేసి.. మరో పార్టీ వారిని శత్రువులుగా చూసే కొత్త సంస్కృతి కూడా ఏపీలో బయల్దేరింది. దీంతో కచ్చితంగా రాష్ట్రంలో ఉండాలంటే.. ఏదో ఒక పార్టీ ముద్ర వేసుకోవాల్సిందే అన్నంతగా పరిస్థితులు విషమించాయి. ఇలాంటి చెడు సంస్కృతిని ప్రధాన పార్టీలు పోషించటం రాజకీయ దురహంకారానికి పరాకాష్ఠ. ప్రజాస్వామ్యంలో ప్రజలే పాలకులు అనే సూత్రానికి నీళ్లొదిలిన నేతలు.. తమ దృష్టిలో అధికారం దక్కించుకున్నవాళ్ల రాజులు.. ప్రజలు వట్టి తరాజులు అనుకుంటున్నారు. ఆ అహంకారం బాగా పెచ్చుమీరి.. చివరకు రాజకీయ ప్రత్యర్థుల్ని లేకుండా చేస్తే.. శాశ్వతంగా అధికారం దక్కుతుందనే దురాశతో.. ఎంతకైనా తెగిస్తున్నారు. దిగజారుతున్నారు. నిరంతర అధికారం అనే అందమైన ఊహ వారిని కుదురుగా ఉండనివ్వటం లేదు. అందుకే ఎప్పటికప్పుడు కొత్తకొత్తగా దురాలోచనలు చేసి.. రాజకీయ నైచ్యానికి తెగబడుతున్నారు.

ఏ రాష్ట్రానికైనా రాజకీయ నాయకత్వం ముందడుగు వేయకపోతే అభివృద్ధి సాధ్యం కాదు. కేవలం కొన్ని సందర్భాల్లోనే ప్రజలు నేతల్ని నడిపిస్తారు. నడిపించగలరు. కానీ ప్రతిసారీ అదే జరగాలని ఆశించలేం. అలా అనుకున్నా.. ప్రస్తుతం ఏపీకి వచ్చే కొద్దో గొప్పో ఆదాయానికి ప్రభుత్వాల బాధ్యత కంటే ప్రజల భాగస్వామ్యమే ఎక్కువ అనేది బహిరంగ రహస్యం. ఈ సంగతి కేంద్రం ఇచ్చే నివేదికల్లోనూ ఎప్పటికప్పుడు తేటతెల్లమౌతూనే ఉంది. అంటే ప్రజలు తమ శక్తిపంచన లేకుండా కష్టపడుతున్నా.. ప్రభుత్వాల నుంచి కనీస తోడ్పాటు లేదనది నిష్ఠూరంగా ఉన్నా నిజం. ప్రజలు, ప్రభుత్వాలు పరస్పర అవగాహనతో పనిచేసినప్పుడే మంచి ఫలితాలు ఉంటాయి. దేశంలో అభివృద్ధి చెందిన, ఆర్థిక ప్రగతి సాధించిన రాష్ట్రాలన్నింటిలోనూ ఇదే జరిగింది. చివరకు ఉమ్మడి రాష్ట్రంలోనూ అదే జరిగింది. ఆ సంగతి ఏపీలో ప్రధాన పార్టీలకు తెలిసినా.. ఏమీ తెలియనట్టే ప్రవర్తిస్తున్నాయి. అసలు రాజకీయాన్ని ఎందుకు అంత సంక్లిష్టం చేస్తున్నారనేది ఎవరికీ అర్థం కాని బ్రహ్మపదార్థం.

ఏదో ఒక సూత్రాన్నో, సిద్ధాంతాన్నో నమ్ముకుని రాజకీయం చేయొచ్చు. చేసిన పని చెప్పుకునో.. ఫలానా పని చేస్తామని చెప్పుకునో కూడా రాజకీయం చేయొచ్చు. కానీ ఏపీలో మాత్రం కలగాపులగం రాజకీయం నడుస్తోంది. ప్రజల బలహీనతలు, బలాలు, అన్నింటినీ మిళితం చేసి.. పార్టీల అవకాశాలు, స్థితిగతుల్ని బేరీజు వేసి.. కలగూరగంప వ్యూహాలు వండివార్చి.. తిమ్మినిబమ్మిని చేసి అధికారం దక్కించుకోవటమే పరమావధిగా రాజకీయం నడుస్తోంది. నేతలు కూడా ఎవరికి వారే వ్యక్తిగత అడ్వాంటేజీలు పెంచుకోవడం మీద దృష్టి పెడుతున్నారే కానీ.. పనిలోపనిగా జనం దగ్గర మంచి పేరు సంపాదించుకుందామని అనుకోవడం లేదు. పైగా కొందరైతే ఏరికోరి చెడ్డపేరు తెచ్చుకుంటున్నారు. అలాగైతే ఎక్కువ పాపులర్ అవుతామనే లెక్కలు వేసుకుంటున్నారు. ప్రజాదరణ పొందడం అంత తేలిక కాదు కాబట్టి.. కనీసం ప్రజలు భయపడేలా చేయగలిగితే.. ఎందుకొచ్చిన గొడవలే అని జనం ఓటేస్తారనుకుంటున్నారనేది అనేది తేలాల్సిన అంశం. ఏపీ అభివృద్ధికి చాలా అవకాశాలున్నాయనేది కేవలం నిపుణులే కాదు.. నీతి ఆయోగ్ కూడా ఏటా ఇచ్చే నివేదికల్లో చెబుతూనే ఉంది. కానీ ప్రధాన పార్టీలు మాత్రం కళ్ల ముందే కనిపిస్తున్న అవకాశాల్ని కసిగా పూడ్చేసి.. అరాచక రాజకీయానికి తెరలేపి ఆనందిస్తున్నాయి. అంతకుమించి ఇంకేం కావాలనే విధానంలో ఆలోచిస్తున్నాయి. ఏ పార్టీ వచ్చినా ఏమున్నది గర్వకారణం. ఏపీ చరిత్ర సమస్తం పరస్పర బూతులు, దాడుల మయం అనుకునే దుస్థితికి తీసుకొస్తారా అని సాధారణ ప్రజలు బెంబేలెత్తుతున్నారు. అంతకుముందు ప్రతిపక్షం ఎక్కడోచోట అవకాశం తీసుకుని చిన్న సమస్యను పెద్దది చేసి.. గలాటా చేసి.. ప్రభుత్వానికి ఇబ్బందులు సృష్టించేది. కానీ ఏపీలో పరిస్థితి రివర్స్ అవుతోంది. ప్రతిపక్షం బుద్ధులు మారాయా.. లేదా అనే విషయం పక్కనపెడితే.. అధికారంలో ఉన్న పార్టీలు మాత్రం రెచ్చిపోతున్నాయి. ఎవరికి వారు ఐదేళ్ల అలెగ్జాండర్ అనే భ్రాంతిలో బతికేస్తున్నారు. తామూ చెంగిజ్ ఖాన్లు కావాలనుకుంటున్నారు. అందుకోసం ప్రజాస్వామ్య వ్యూహాలకు పాతరేసి.. ఆటవిక వ్యూహాలకు ఆజ్యం పోస్తున్నారు. రాజకీయం అంటే ఎక్కువమందిని కన్విన్స్ చేయాలని చెప్పేవారు. కానీ ఏపీ పార్టీలు మాత్రం ఎక్కువమందిని భయపెట్టడమే రాజకీయమని నిరూపిస్తున్నాయి.

ప్రజల కష్టసుఖాలు తెలుసుకోవటమే రాజకీయం కాదని ఏపీ పార్టీలు తేల్చేస్తున్నాయి. పైగా అడ్డంగా నరకటమే అసలైన రాజకీయం అనే యావలో పడిపోతున్నాయి. అంత పని చేయటానికి ప్రత్యర్థులు ఎక్కడ ఎప్పుడు ఎలా దొరుకుతారా అని మాటువేసి మరీ స్కెచ్ గీస్తున్నాయి. ఇదేం సంస్కృతి అని ఎవరైనా అడిగితే.. నీవు నేర్పిన విద్యయే నీరజాక్ష అని ప్రత్యర్థులపైనే నెపం నెడుతున్నారు. వారు చెడ్డవారు సరే.. మీరెందుకు అదే రొంపిలో దిగాలంటే.. స్ట్రగుల్ ఫర్ ఎగ్జిస్టెన్స్ అని వీర లాజిక్కు లాగుతున్నారు. మొత్తం మీద పాటాపోటీగా అరాచకాన్నే రాజకీయంగా పండించాలని ప్రధాన పార్టీలు కంకణం కట్టుకున్న దుస్థితి ఏపీలో కనిపిస్తోంది. ఎవరి హితోక్తులూ వినటానికి నేతలు సిద్ధంగా లేరు. అసలు వారికి తెలియకపోతే కదా వేరొకరు చెప్పటానికి అనే సెటైర్లూ పడుతున్నాయి. అన్ని విషయాల మీదా పూర్తి అవగాహనతో.. పర్యవసానాలపై పూర్తి స్పృహతోనే ఆటవిక రాజకీయం చేస్తున్నామన్నట్టుగా పార్టీలు, నేతలు తమ చర్యలతో చాటిచెబుతున్నారు.

ఇక్కడ ఎవరికీ ఏపీ రాజకీయాలపై ఉద్దేశపూర్వకంగా కక్ష ఉండదు. కానీ ఏపీ రాజకీయ పరిణామక్రమం చూస్తున్నవారెవరికైనా ఒక ఆవేదన కలగటం సహజం. ఇప్పటికే అభివృద్ధికి అవకాశం ఉండి కూడా.. ఏపీలో ఎక్కడవేసిన గొంగళి అక్కడే ఉందన్న అభిప్రాయాలున్నాయి. ఇది చాలదన్నట్టుగా లేని లా అండ్ ఆర్డర్ సమస్యను కూడా కొనితెచ్చుకోవటం ఏంటనే ప్రశ్నలు వస్తున్నాయి. వీటికి కచ్చితంగా ప్రధాన పార్టీలే సమాధానం చెప్పాలి. నమ్మి అధికారం ఇచ్చిన ప్రజలకు, ఆదరించిన ప్రజలకు మేలు చేయకపోగా.. మొత్తం రాష్ట్రానికే చెడ్డపేరు తెచ్చే అధికారం ఎవరిచ్చారో చెప్పాలి. ఎవరికి తోచినట్టు వారు తాత్కాలిక అధికారం కోసం అరాచకాన్ని సృష్టించుకుంటూ పోతే.. ఈ ఫలితాన్ని ప్రజలు ఎందుకు భరించాలో పార్టీలు, వాటి నేతలే ఆన్సర్ ఇవ్వాలి. చేతైతే ఏపీ సమస్యలు పరిష్కరించాలి. చేతకాకపోతే తమ వల్ల కాదని ప్రజల్ని క్షమాపణ కోరాలి. అంతేకానీ ఇలా రాజకీయ అరాచకత్వానికి తెరలేపటం.. క్షంతవ్యం కాదు. అసలు ఇలాంటి పార్టీలు, నేతలకు ప్రజాక్షేత్రంలో ఉండే అర్హత ఉందా.. లేదా అనేది పౌర సమాజం ఆలోచించాల్సిన సమయం వచ్చేసినట్టే కనిపిస్తోంది. ఇంకా ఉపేక్షిస్తే ఈ అరాచక శక్తులు ఏ స్థాయి విధ్వంసం సృష్టిస్తాయో ఊహకు కూడా అందటం లేదు. ఇద్దరు మంచివాళ్ల మధ్య గొడవస్తే పరిష్కారం ఉంటుంది. ఒక మంచివాడు, ఒక చెడ్డవాడు కొట్టుకున్నా ఏదోలా పరిష్కారం చూపించవచ్చు. కానీ ఇద్దరు చెడ్డవాళ్ల గొడవను ఎవరూ పరిష్కరించలేరు. ఎందుకంటే నువ్వొకటంటే.. నేరెండంటా అనే పోకడతో ఏ తగవూ తెగదు. ఏ సమస్యా కొలిక్కి రాదు. ఏపీలో రాజకీయాలు ఎంతగా దిగజారాయంటే.. పొరపాటున ఎవరైనా మంచి పని చేసినా.. ఆ పని మంచిది కాదు చెడ్డదే అని ప్రత్యర్థులు పనిగట్టుకుని నిరూపిస్తున్నారు. అసలు పనిచేయకముందే.. మంచి ప్రయత్నాన్నే శాయశక్తులూ వినియోగించి అడ్డుకుంటున్నారు. తద్వారా రాష్ట్రానికి, ప్రజలకు పొరపాటున కూడా మంచి పని జరకుండా, జరగనీయకుండా ప్రధాన పార్టీలు సకల జాగ్రత్తలూ తీసుకుంటున్నాయి. ఇదీ ఈ వారం ఛైర్మన్స్ డెస్క్. మరో అంశంపై విశ్లేషణతో మళ్లీ కలుద్దాం. కీప్ వాచింగ్ ఎన్టీవీ.

ఏడో వార్డులో
కాంగ్రెస్ ప్రచారం

జర్నలిస్ట్ డైరీ, షాద్ నగర్:
షాద్‌నగర్ మున్సిపాలిటీ ఎన్నికల సందర్భంగా 7వ వార్డు కాంగ్రెస్ అభ్యర్థి కొప్పునూరు ప్రవీణ్ కు మద్దతుగా విస్తృత స్థాయిలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కేశంపేట మండల అధ్యక్షులు గూడా వీరేశం ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు కాలనీల్లో తిరుగుతూ ఓటర్లను కలిసి మద్దతు కోరారు. ప్రచారం సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, "వార్డు అభివృద్ధి కోసం పనిచేసే అభ్యర్థి కొప్పునూరు ప్రవీణ్. చేతి గుర్తుకు ఓటు వేసి ఆయనను గెలిపించాలని ప్రతి ఓటరిని కోరుతున్నాం" అని తెలిపారు. ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కొండారెడ్డిపల్లి గ్రామ అధ్యక్షుడు టీ. సుదర్శన్, యూత్ అధ్యక్షుడు వట్టెల లింగం యాదవ్, పెంటయ్య, రాము పాల్గొన్నారు.

తాండూరు లో కాంగ్రెస్
విజయం ఖాయం

- **ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి**

**జర్న

స్వీట్స్ అధికంగా తింటున్నారా.. ఈ విషయాలు తెలుసుకోండి..!

స్వీట్స్ అంటే ఎవరికి నచ్చవు. చిన్నప్పుడు అయితే స్వీట్స్ కనిపిస్తే చాలు వాటిని రుచి చూసే వరకు నిద్రకూడా పట్టదు. స్వీట్స్ అంటే ప్రతి ఒక్కరికి నోరూరుతుంది. కానీ ఆతర్వాతే మనల్ని ఉసూరుమనిపిస్తాయని ఆరోగ్య నిపుణులు చెప్తున్నారు. కొందరికి మాత్రం వీటిని తినకుండా రోజు గడవదు. అలాంటి వారికి వైద్య నిపుణుల తీవ్ర హెచ్చరికలు చేస్తున్నారు. స్వీట్స్ ప్రతి రోజు తూచా తప్పకుండా తింటుంటే.. అంతే తూచా తప్పకుండా తిన్న స్వీట్స్‌కు రెట్టింపుచిన వ్యాయామం చేయాలని చెప్తున్నారు. అలా చేయకపోతే అది మన ఆరోగ్యంపై తీవ్ర దుష్ప్రభావం చూపుతుందని హెచ్చరిస్తున్నారు. స్వీట్ ఐటమ్స్‌లో చాలా వరకు మైదా, చక్కెర అధికంగా ఉంటాయి. ఇవి అధికంగా తినడం వల్ల, ప్రతి రోజు తినడం వల్ల గ్లూకోజ్ అంతా కూడా శరీరంలో గ్లైకోజెన్‌గా నిల్వ అవుతుంది. అలా కాకుండా ఉండాలంటే స్వీట్స్ అధికంగా తిన్న తర్వాత నీరు తప్పకుండా తాగాలని నిపుణులు చెప్తున్నారు. అయితే ఎంత చేసినా.. ఏం చేసినా ప్రతి రోజు స్వీట్స్ తూచా తప్పకుండా తినడం మన ఆరోగ్యంపై దుష్ప్రభావమే చూపుతుందని, కాబట్టి రోజు స్వీట్స్ తినే అలవాటును క్రమంగా తగ్గించుకోవడం మంచిదని సూచిస్తున్నారు. ఆర్టిఫిషియల్ స్వీట్స్‌ను అధికంగా తినడం వల్ల శక్తి కోల్పోయే అవకాశం ఉందని, ఫలితంగా అలసట, నీరసం, బద్ధకం, ఏకాగ్రత కోల్పోవడం వంటి సమస్యలు వస్తాయని చెప్తున్నారు. స్వీట్స్ తిన్న (Eat Sweets) తర్వాత భోజనం చేస్తే కొవ్వు పెరిగిపోతుందని, రోగనిరోధక శక్తిపై ప్రభావం అధికంగా ఉండి బ్యాక్టీరియా, వైరల్ ఇన్ఫెక్షన్లు వచ్చే ప్రమాదం పెరుగుతుందని అంటున్నారు. పంచదార, పంచదార ఉత్పత్తులు ప్రతి రోజు తినడం వల్ల డిప్రెసివ్‌గా అనిపిస్తుందని, స్వీట్స్ తినడం మనకు ఒత్తిడి నుంచి తాత్కాలిక ఉపశమనం కల్పించినా దీని ప్రభావం ఆరోగ్యం దీర్ఘకాలికంగా తీవ్రంగా ఉంటుందని, కాబట్టి వీలైనంత వరకు స్వీట్స్‌ను అధికంగా తినడం మానుకోవాలని సూచిస్తున్నారు.

వేసవిలో వచ్చే వ్యాధులివే

వేసవి వచ్చేసింది. ఇప్పుడు కాదు.. ఫిబ్రవరి నెలలోనే భానుడు భగభగ మనడం షురూ చేశాడు. ఇప్పటికే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఒడిసా, ఝార్ఖండ్, ఛత్తీస్‌గఢ్ వంటి రాష్ట్రాల్లో ఉష్ణోగ్రత 40 డిగ్రీల సెల్సియస్‌ను దాటేస్తోంది. ఈ ఏడాది వేసవిలో ఉష్ణోగ్రతలు 48 డిగ్రీలను దాటినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం నిపుణులు చెప్తున్నారు. అంతేకాకుండా ఈ ఏడాది అత్యంత ఉష్ణమైన సంవత్సరంగా నిలుస్తుందని కూడా అంటున్నారు. అయితే పెరగనున్న వేడి వల్లే అనేక వ్యాధులు వచ్చే అవకాశాలు ఉన్నందున ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు. పెరుగుతున్న వేడి, వీస్తున్న వడగాలుల నేపథ్యంలో మిమ్మల్ని, మీ కుటుంబాన్ని సురక్షితంగా ఉంచుకోవడానికి మీరు కొన్ని నియమాలను పాటించాలి. ఈ వేడిలో అవసరమైతే తప్ప ఇంటి నుంచి బయటకు రాకపోవడమే మంచిదంటున్నారు నిపుణులు. కానీ మీరు వెళ్లినట్లయితే మీతో గొడుగు, వాటర్ బాటిల్ ఉంచడం తప్పనిసరి. ఇలాంటి పరిస్థితుల్లో ఇంట్లో ఉన్న వృద్ధులు, పిల్లలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. వేసవి తాపంతో చిన్నారుల నుంచి వృద్ధుల వరకు అందరూ అల్లాడిపోతున్నారు. వేసవిలో మిమ్మల్ని మీరు ఎల్లప్పుడూ హైడ్రేటెడ్‌గా ఉంచుకోండి. ఆరోగ్యంగా ఉండటానికి తగినంత నీరు త్రాగాలి. వేసవిలో వచ్చే ఆరోగ్య సమస్యల గురించి తెలుసుకుందాం..

వడదెబ్బ:
చాలా మందికి తీవ్రమైన వేడిలో హీట్ స్ట్రోక్ వస్తుంది. అటువంటి పరిస్థితిలో క్యాన్డ్ వాటర్, సొరకాయ, బొప్పాయి రసాన్ని పలుచగా చేసి తాగాలి. పుచ్చకాయలాంటి పండ్లు తినాలి. ఇది శరీరంలో నీటిని ఎక్కువ కాలం నిల్వ ఉంచుతుంది. అలాగే హీట్ స్ట్రోక్ విషయంలో ప్రభావితమైన వ్యక్తిని త్వరగా చల్లని ప్రదేశానికి తరలించండి. కళ్ళు, ముఖం, మెడకు నీటిని రాయండి. నీరు తాగాలి పరిస్థితి మెరుగుపడకపోతే వెంటనే సమీపంలోని ఆసుపత్రికి తరలించండి.

యూరినరీ ట్రాక్ట్ ఇన్ఫెక్షన్:
వేసవి ఎండలో మన శరీరం డీహైడ్రేషన్‌కు గురవుతుంది. ఇలాంటి పరిస్థితుల్లో యూరినరీ ట్రాక్ట్ ఇన్ఫెక్షన్స్ చాలా సాధారణం. ఈ సమస్యలో ఆమ్ల లేదా పుల్లని పండ్లు తక్కువగా తినాలి. మీరు దాల్చిన చెక్క, వెల్లుల్లి, తేనె వంటి యాంటీ బాక్టీరియల్ ఆహారాన్ని తినవచ్చు. ఇది పరిష్కరిస్తుంది. అలాగే చాలా బాగా పనిచేస్తుంది.

కడుపు సమస్య:
వేసవిలో దాదాపు ప్రతి ఒక్కరికి కడుపు నొప్పి లేదా అజీర్ణం ఉంటుంది. ఎందుకంటే చాలా మంది వీధిలో బహిరంగ వాతావరణంలో చేసిన చెరుకు రసం, నిమ్మరసం, బెల్ సిరప్, కలబంద రసం, పంచదార పండ్ల రసం వంటివి తీసుకుంటారు. ఇది టైఫాయిడ్, హెపటైటిస్, డయేరియా, విరేచనాలు, అజీర్ణం వంటి ఇతర సమస్యలను కలిగిస్తుంది. నీరు, పుల్లటి పెరుగు, యాపిల్, పచ్చి అరటిపండు, బొప్పాయి, అల్లం, జీలకర్ర, తులసి టీ, ఓట్స్, తేనె, రెడ్ ఫుడ్ ఏదైనా కడుపు సమస్యకు బాగా పనిచేస్తాయి. అంతేకాకుండా దోసకాయలాంటి మొదలైన కడుపు సమస్యలకు చాలా మేలు చేస్తాయి. అలాగే వేసవిలో ఆహారం తరచుగా పాడైపోతుంది, ఇది ఫుడ్ పాయిజనింగ్‌కు దారితీస్తుంది. కుళ్లిన ఆహారం, స్ట్రీట్ ఫుడ్ తినకపోవడమే మంచిది.

ఎలక్ట్రోలైట్ అసమతుల్యత:
వేడి వాతావరణంలో చెమటతో సోడియం, పొటాషియం, క్లోరైడ్ వంటి అనేక ముఖ్యమైన ఖనిజాలు పోతాయి. ఫలితంగా మన శరీరంలో అనేక సమస్యలు తలెత్తుతాయి. క్యాన్డ్ వాటర్, అరటిపండు, పచ్చి మామిడి, లిచీ, నిమ్మకాయ సిరప్, పండ్ల రసం మొదలైనవి దాని లోపాన్ని పూరించడానికి సహాయపడతాయి.

జలుబు, దగ్గు:
అధిక వేడి లేదా సీజన్ మారడం వల్ల చాలా మంది జలుబు, దగ్గు, గొంతునొప్పి బారిన పడుతున్నారు. విటమిన్ సి అధికంగా ఉండే పుల్లని పండ్లు, నారింజ, పైనాపిల్స్, జామ, క్యాప్సికమ్ వంటి కూరగాయలను తినడం వల్ల ఇది సహాయపడుతుందని నిపుణులు అంటున్నారు. అలాగే వేడి సూప్, గ్రీన్ టీ, తులసి టీ, అల్లం టీ లేదా ఏదైనా హెర్బల్ టీ జలుబు, దగ్గు, గొంతు నొప్పిని నయం చేయడంలో ప్రభావవంతంగా ఉంటాయి.

చర్మ సమస్యలు:
ఇది కూడా సాధారణ వేడి సమస్య. చర్మం సూర్యరశ్మికి, చర్మ కణాలను దెబ్బతీసే హానికరమైన అతినీలలోహిత కిరణాలకు ఎక్కువగా బహిర్గతం అయినప్పుడు సన్ బర్న్ సంభవిస్తుంది. సూర్యరశ్మి కూడా ముఖం, చేతులు, కాళ్ళపై బాధాకరమైన దద్దుర్లు కలిగిస్తుంది. వడదెబ్బ వల్ల ఎరుపు, పొక్కులు, చర్మ సమస్యలు వస్తాయి. దీనిని నివారించడానికి, నీరు తాగండి. చర్మాన్ని హైడ్రేట్ గా ఉంచుకోండి. ఇంటి నుండి బయటకు వెళ్లేటప్పుడు సన్‌స్క్రీన్‌ని అప్లై చేయండి. వీలైతే బహిర్గతమైన చర్మాన్ని కవర్ చేయండి. ఎండలో ఆరుబయట గడిపే సమయాన్ని కూడా తక్కువ చేయండి. ఈ వేసవిలో అదనపు మసాలాలు, నూనె, వేయించిన, ఓపెన్ స్ట్రీట్ ఫుడ్‌కు దూరంగా ఉండాలని నిపుణులు అంటున్నారు. అలాగే కొవ్వు పదార్థాలు, మాంసం మొదలైన వాటికి దూరంగా ఉండాలి.

చేదు కాకరకాయతో కమ్మని ఆరోగ్యం..

కాకరకాయ అంటే అందరికీ ముందుగా గుర్తొచ్చేది నోరు పాడు చేసే చేదు. ఆ చేదును తల్చుకుంటేనే ఒళ్లు గగుర్పొడుస్తుంది. కానీ చాలా మందికి కాకరకాయ చాలా ఫేవరేట్ ఫుడ్ కూడా. కాకరకాయతో ఏం చేసినా వాళ్లు ఒక పట్టు పట్టేస్తారు. అదే విధంగా చాలా మంది కాకరకాయ పేరు ఎత్తితేనే చికాకు పడతారు. అదెవరైనా తింటారా అనేస్తారు. కాకరకాయ కూర అంటే ఆ పూట భోజనమే వద్దనే వాళ్లనే వారు దాదాపు ప్రతి ఇంట్లో ఉంటారు. కాకరకాయ అంటే ఆమడ దూరం వెళ్లే వారి సంఖ్య అధికంగానే ఉందని వైద్య నిపుణులు చెప్తున్నారు. కాగా కొందరు కాకరకాయ వంటకాలను భలే ఇష్టంగా తింటారు. అయితే దీనిని ప్రతి ఒక్కరూ తినాలని వైద్యులు సూచిస్తున్నారు. కాకరకాయ ఉండటానికి చేదుగా ఉన్నప్పటికీ దీంతో కమ్మని ఆరోగ్యం మన సొంతమవుతుందని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. నిజం చెప్తే దీని చేదు రుచే మన ఆరోగ్యానికి తియ్యని ఫలితాలు ఇస్తుందని అంటున్నారు. అనేక ఆరోగ్య సమస్యలను చెక్‌లో ఉంచడమే కాకుండా మరెన్నో వ్యాధులు రాకుండా అడ్డుకోవడంలో కూడా కాకరకాయ ప్రధాన పాత్ర పోషిస్తుందని ఆరోగ్య నిపుణులు వివరిస్తున్నారు. వారంలో రెండు సార్లయినా కాకరకాయను తినడం వల్ల మనం చాలా ఆరోగ్యంగా ఉండొచ్చని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. ఇంతకీ ఆ ఆరోగ్య ప్రయోజనాలేంటో ఒకసారి చూద్దామా..

అధిక బరువు:
బరువు తగ్గాలనుకునే వారికి కాకరకాయ మంచి ఆప్షన్ అని వైద్యులు అంటున్నారు. ఇందులో పోషకాలు అధికంగా ఉండి, కేలరీలు స్వల్పంగా ఉంటాయి. దీని వల్ల బరువు తగ్గాలని అనుకునే వారికి ఇది చాలా మేలు చేస్తుంది. ఇందులో అధికంగా ఉండే ఫైబర్.. ఎక్కువ సేపు ఆకలి వేయకుండా ఉండేలా చేస్తూ బరువు తగ్గడానికి దోహపడుతుంది.

జీర్ణవ్యవస్థ:
కాకరకాయలో ఎక్కువగా ఉండే ఫైబర్ మన జీర్ణవ్యవస్థను మెరుగు పరచడంలో కీలక పాత్ర పోషిస్తుంది. కాకరకయల్లోని ఫైబర్ శాతం.. పేగు ఆరోగ్యాన్ని రక్షించడమే కాకుండా మలబద్ధకం వంటి సమస్యలను దూరం చేస్తుంది. జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది.

గుండె భద్రం:
కాకరకాయ తినడం వల్ల మన గుండె పదిలంగా ఉంటుంది. ఇందులో ఉండే పొటాషియం, మెగ్నీషియం వంటి సమ్మేళనాలు గుండె ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. ఈ ఖనిజాలు రక్తపోటును నియంత్రించడంలో కూడా ఎంతో సహాయపడతాయి. వారంలో రెండు మూడు సార్లు కాకరకాయ తినడం ద్వారా గుండెపోటు ప్రమాదాన్ని తగ్గించొచ్చని వైద్యులు అంటున్నారు.

డయాబెటిక్స్:
షుగర్ వ్యాధితో ఇబ్బంది పడేవారికి కాకరకాయ దివ్యౌషధంలా పనిచేస్తుంది. వీటిలో ఉండే పాలీపెప్టైడ్‌పీ అనే ఇన్సులిన్ లాంటి సమ్మేళనాలు రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో కీలక పాత్ర పోషిస్తాయి. అందువల్ల షుగర్ వ్యాధిగ్రస్తులకు కాకరకాయ చాలా మంచిదని ఆరోగ్య నిపుణులు చెప్తున్నారు.

విటమిన్లు:
కాకరకాయల్లో మన శరీరానికి కావాల్సిన విటమిన్లు, ఖనిజాలు పుష్కలంగా ఉంటాయి. కాకరకాయల్లో విటమిన్‌సీ అధికంగా ఉంటుంది. వీటిలో ఉండే యాంటీ యాక్సిడెంట్లు.. ఫ్రీ రాడికల్స్ వల్ల కలిగే నష్టం నుండి శరీరాన్ని రక్షించడానికి సహాయపడుతుందని వైద్యులు వివరిస్తున్నారు. అంతేకాకుండా కాకరకాయలు రోగనిరోధక శక్తిని పెంపొందించడంలో కూడా ప్రధాన పాత్ర పోషిస్తాయి.

ఈ చిట్కాలతో హెయిర్ ఫాల్ మాయం!

మారుతున్న కాలానుగుణంగా వాతావరణం కూడా మారుతోంది. ఇప్పుడు ఉన్న బిజీ లైఫ్‌లో దాదాపు అన్నీ వయస్సు వారు ఎదుర్కొంటున్న సమస్య హెయిర్ ఫాల్. హెయిర్ ఫాల్‌ని తగ్గించేందుకు హోమ్ రెమిడీస్‌అని విలువైన ప్రొడక్ట్స్, ట్రీట్‌మెంట్స్ అని డబ్బులు వృథా చేస్తుంటారు. జుట్టు రాలే సమస్యను కొన్ని సింపుల్ చిట్కాలతో దూరం చేసుకోవచ్చు. అవి ఎంటో ఇప్పుడు చూద్దాం..

జుట్టు రాలడం తగ్గించాలంటే హెయిర్ కేర్ అనేది చాలా ముఖ్యం. జుట్టును ఆరోగ్యంగా ఉంచుకోడానికి మనకి రోజువారీ జీవితంలో వాడే వస్తువులతోనే నిపుణులు కొన్ని చిట్కాలు సూచిస్తున్నారు. స్ట్రెస్ వల్ల జుట్టు రాలిపోయే అవకాశం కూడా ఉంది. ఖచ్చితంగా స్కాల్ప్‌కు మంచి మసాజ్ చేసుకోవాలి. ఇది స్ట్రెస్ తగ్గించడమే కాకుండా జుట్టు రాలడాన్ని కంట్రోల్ చేస్తోంది. జుట్టుకు నూనె పెట్టి మసాజ్ చేస్తే ఫలితాలు వస్తాయని ఓ అధ్యయనంలో తేలింది. దీని ద్వారా స్కాల్ప్‌లో రక్త ప్రసరణ పెరిగి జుట్టు ఆరోగ్యం మెరుగు పడుతుందని పేర్కొంది.

ఉల్లిపాయ రసం కూడా జుట్టు రాలడం తగ్గించడంలో సహాయపడుతుంది. ఉల్లిపాయ రసం జుట్టు పెరుగుదలను ప్రోత్సహిస్తుంది. తలలో రక్త ప్రసరణను మెరుగుపరచి స్ట్రాంగ్‌గా తయారువుతుంది. అలాగే.. అలోవెరా ప్రతీ ఇంట్లో అందుబాటులో ఉండే ఒక ఔషధపు మొక్కనే చెప్పుకోవచ్చు. అలోవెరాను జుట్టు రక్షణలో రకరకాలు ఉపయోగిస్తారు. ఇది చుండ్రును కంట్రోల్ చేసి జుట్టును కుదుళ్లను హెల్తీగా చేస్తుంది. స్వచ్ఛమైన కలబంద గుజ్జును హేర్‌కేర్ రోటీన్‌లో వాడడం ద్వారా మంచి ఫలితాలు పొందవచ్చు.

ఇవే కాకుండా.. తీసుకునే ఫుడ్ విషయంలో కూడా చాలా జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు. లోపలి నుంచి మంచి పోషణ అందితేనే జుట్టు అనేది స్ట్రాంగ్‌గా ఉంటుందంటున్నారు. కాబట్టి ప్రోటీన్ వంటి పోషకాలు కలిగిన ఫుడ్ తీసుకోవాలి. విటమిన్ సీ ఎక్కువగా ఉండే జామ పండ్లు తినడం వల్ల జుట్టు బలంగా పెరుగుతుంది. అంతే కాకుండా ఇది జుట్టు రాలడాన్ని నివారించి, కొత్త జుట్టు పెరుగుదలను ప్రోత్సహిచడంలో చాలాముఖ్య పాత్ర పోషిస్తుందని చెబుతుంటారు. అలాగే..నారింజ, కివీ, బొప్పాయి, ఆపిల్ పండ్లు హెయిర్ ఫాల్ తగ్గించడానికి, జుట్టు ధృడంగా ఉండడానికి ఉపయోగపడే ఫ్రూట్స్‌అని సూచిస్తున్నారు.

వేసవిలో శరీర వేడిని తగ్గించేవి ఇవే..

రోజురోజుకూ ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతున్నాయి. ఉదయం 8 నుంచే భానుడు భగ్గు మంటున్నాడు. జనాలు ఇంటి నుండి బయటకి వెళ్లాలంటే జంకుతున్నారు. ఈ క్రమంలో ప్రజలు తమ ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోవాలంటూ వైద్య నిపుణులు సూచిస్తున్నారు. వేసివి లో శరీరాన్ని చల్లబరిచేందుకు ఎలాంటి డ్రింగ్స్ తీసుకోవాలో అనే విషయాలను వారు సూచిస్త్న్నారు. వారు ఏంసూచిస్తున్నారంటే...

'అందరికీ తెలిసిన విషయమే వేసవిలో ఎక్కువ నీరు త్రాగడం తప్పనిసరి అని.. నీటితో పాటు చెరుకు రసం తీసుకుంటే శరీరాన్ని హైడ్రేట్ చేయడంతో ఉపయోగ పడుతుంది. ఇలా చేయడం వల్ల ఇంకో ఉపయోగం కూడా ఉందండోయ్.. ఇది కామెర్ల రోగులకు చెరుకు ఔషధంలా పనిచేస్తుంది. అలాగే కొబ్బరి నీరు తీసుకోవడం ద్వారా అధిక చెమటను నివారించి, శరీరం నుండి మలినాలను తొలగిస్తుంది. ప్రతీ ఇంట్లో అందుబాటులో ఉండే చింతపండు కూడా శరీరాన్ని చల్లబరచడంలో తన పాత్ర పోషిస్తది. పని మీద బయటకు వెళ్లేముందు చింతపండు నీరు రసం తాగడం వల్ల వడదెబ్బ తగిలే అవకాశం ఉండదు' అని నిపుణులు పేర్కొంటున్నారు.

'అదేవిధంగా లెమన్.. వేసవి కాలం వచ్చింది అంటే తగ్గేదేలే అంటుంది. అన్నీటితో పోలిస్తే దీనికి ఉండే డిమాండే వేరు.. ఎన్నితాగినా.. లెమన్ నాకు ఉన్న ప్రత్యేకతే వేరంటుంది. అసలు దీనికి ఎందుకు ఇంతా డిమాండ్, దీని వల్ల ఏం ప్రయోజనాలేమంటే.. నిమ్మకాయలో విటమిన్ సి, థయామిన్, నియాసిన్, రిబోఫ్లెవిన్, విటమిన్ బి6, ఫోలేట్ వంటి విటమిన్‌ఉల ఉంటాయి. ఈ పోషకాలు ఆరోగ్యానికి మంచిచేస్తాయి. వేసవిలో శరీరాన్ని హైడ్రేట్ గా ఉంచే రసాల్లో నిమ్మరసం ఉత్తమమైనది. చిన్నపెద్దా అందరూ దీన్ని ఇంట్లోనే తయారు చేసుకోని తాగుతూఉంటారు. దీంతో పాటు రాగిజావ,మజ్జిగ శరీరానికి చల్లదన్నాన్ని ఇస్తాయి. వీటితో పాటు మార్కెట్లో లభించే పండ్లు నారింజ, ద్రాక్ష, వాటర్ మిలోన్, దోసకాల, ఇలా నీటి శాతం ఉండే పండ్లను తీసుకోవడం ద్వారా ఎండ తీవ్రత నుండి రక్షించుకోడానికి ఎంతగానో దోహదపడుతాయి' అంటూ వారు సూచిస్తున్నారు.

వారెవ్వా బాదం.. ఉపయోగాలు తెలిస్తే షాక్

బాదం.. ఇది రోజు చూసే వాటిలో ఒకటి. ఇది ప్రకృతి నుంచి లభించే ఒక ఆహార పదార్థం. దీనిలో ఔషధ గుణాలు ఉన్నాయని చాలా మందికి తెలియదు. ఆయుర్వేద వైద్యంలో బాదం ఎలా ఉపయోగ పడుతుందో తెలుసుకుందాం.

ఈ బాదంను మన దేశంలో జమ్మూకశ్మీర్, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాలు ఎక్కువగా ఉత్పత్తి చేస్తాయి. బాదంను కొంత మోతాదులో తీసుకొని రాత్రి నీటిలో నానబెట్టుకొని ఉదయం పరిగడుపున తినడం ద్వారా మంచి ఆరోగ్య ఫలితాలు వస్తాయి. అలాగే, బాదం పప్పును అంజీర పండుతో కలిపి తింటే మలబద్ధకం తగ్గుతుందని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. దీనిలో కాల్షియం, మెగ్నీషియం, పొటాషియం, ఫాస్ఫరస్ వంటి ఖనిజాలు కూడా పుష్కలంగా ఉంటాయి.

అందుకే బాదంకు పోషకాల గని అంటుంటారు. దీనిని బాదం వెన్న, బాదం పాలు, నూనె తయారీలో కూడా వాడుతారు. బాదం పప్పును పచ్చిగా తినడంతోపాటు వివిధ వంటకాల్లో కూడా వాడుతారు. దీని ద్వారా ఎన్నో రకాల ప్రోటీన్లు సమృద్ధిగా లభిస్తాయి. అధిక బరువు ఉన్నవారి కొవ్వు తగ్గించడంలో బాదం కీలక పాత్రను పోషిస్తుంది. జీర్ణక్రియ సమస్య మెరుగుపడుతుంది.

బాదం పప్పు తినడం ద్వారా జ్ఞాపకశక్తి మరింతగ మెరుగవుతుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. రక్తంలో తెల్ల, ఎర్ర కణాల సంఖ్యను పెంచుతుంది. అందువలన రక్తహీనత సమస్య నుంచి తప్పించుకోవడానికి ప్రతీరోజు బాదం తినాలని వైద్యులు సూచిస్తారు. అంతేకాదు.. రొమ్ము క్యాన్సర్, ప్రొస్టేట్ క్యాన్సర్ వంటి వాటి నుంచి కూడా కాపాడుకోవొచ్చు. ఇది డయాబెటిస్ రోగులకు దివ్యౌషదమని చెబుతుంటారు.

ఘనంగా ఎర్రచీర థ్యాంక్స్ మీట్, యాక్టింగ్ క్వీన్ కారుణ్య చౌదరి బర్త్ డే సెలబ్రేషన్స్

నేటి సినిమాల్లో హారర్ జోనర్ అంటే కేవలం దెయ్యం పగ తీర్చుకోవడం అనే మూస ధోరణి కనిపిస్తుంది. కానీ, దానికి "మదర్ సెంటిమెంట్" అనే అరుదైన ఎమోషన్‌ను జోడించి, ఒక యదార్థ సంఘటన ఆధారంగా దర్శకుడు క్రియేటివ్ స్టార్ సుమన్ బాబు తెరకెక్కించిన చిత్రం 'ఎర్రచీరది బిగినింగ్'. బేబి డమరి సమర్పణలో శ్రీ పద్మాయల ఎంటర్టైన్మెంట్స్, శ్రీ సుమన్ వెంకటాద్రి ప్రొడక్షన్స్ బ్యానర్స్‌పై ఎన్‌వీవీ సుబ్బారెడ్డి, సుమన్ బాబు సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రం ఫిబ్రవరి 6న గ్రాండ్‌గా రిలీజ్ అయింది. మదర్ సెంటిమెంట్, హారర్, యాక్షన్ అంశాలతో రూపొందిన ఈ సినిమాలో ప్రముఖ నటుడు రాజేంద్రప్రసాద్ ముద్దుల మనవరాలు బేబీ సాయి తేజస్విని కీలక పాత్రలో నటించగా, దర్శకుడు సుమన్ బాబు స్వీయ దర్శకత్వం వహిస్తూ ఒక ముఖ్య పాత్రను కూడా పోషించారు. యాక్టింగ్ క్వీన్ కారుణ్య చౌదరి రెండు డిఫరెంట్ వేరియషన్స్ ఉన్న పాత్రల్లో అద్భుతంగా నటించి మెప్పించారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో సినిమాకు వస్తున్న అద్భుతమైన ఆదరణకు టీమ్ ఫిదా అవుతోంది. భర్త ప్రేమ కంటే మాతృప్రేమ గొప్పదంటూ చెప్పే అద్భుతమైన మెసేజ్‌తో వచ్చిన తమ చిత్రాన్ని ఎంతగానో ఆదరిస్తున్న ప్రేక్షకులకు ధన్యవాదాలు చెప్పేందుకు మూవీ టీమ్ ఆదివారం థ్యాంక్స్ మీట్ నిర్వహించింది. సినిమాలోని ముద్దు పాటకు థియేటర్లలో వస్తున్న రెస్పాన్స్‌పై టీమ్ హర్షం వ్యక్తం చేసింది. ఆ సందడిని గుర్తు చేసుకుంటూ ముందుగా హీరో సుమన్ బాబు, హీరోయిన్ కారుణ్య చౌదరి ఇద్దరూ ఎంతో సరదాగా ముద్దు పాటకు డ్యాన్స్ చేసి అలరించారు.

అనంతరం ఈ కార్యక్రమంలో ప్రముఖ డిస్ట్రిబ్యూటర్, జయలక్ష్మి ఫిలిమ్స్ అధినేత ద్రోణాదుల వెంకట్రావ్ మాట్లాడుతూ.. ''ఫిబ్రవరి 6న విడులయ్యే అన్ని సినిమాల్లో ఎర్ర చీర ఒకటే థియేటర్లలో బలంగా నిలబడుతుందని ప్రీరిలీజ్ ఈవెంట్‌లో చెప్పాను. ఇప్పుడు అదే జరుగుతోంది. దీనంతటికి కారణం ఒకే ఒక్కడు సుమన్ బాబు. ఆయన ఎంతో కష్టపడి కుటుంబమంతా చూడగలిగే అద్భుతమైన చిత్రాన్ని తీశారు. మంచి ఎమోషన్స్, సెంటిమెంట్ ఉన్న ఈ చిత్రానికి బి,సి సెంటర్స్‌లో ఆడియన్స్ బ్రహ్మరథం పడుతున్నారు. అన్ని చోట్లా సినిమాకు మంచి ఆదరణ వస్తోంది. సినిమాను ఆదరిస్తున్న ప్రేక్షకులందరికీ ధన్యవాదాలు'' అని చెప్పారు.

యాక్టింగ్ క్వీన్ కారుణ్య చౌదరి మాట్లాడుతూ.. "మా సినిమాను మంచి సక్సెస్ చేసిన ప్రేక్షకులందరికీ చాలా పెద్ద థాంక్స్. మరీ ముఖ్యంగా మహిళలు ఎర్రచీర సినిమాను ఎక్కువగా ఆదరిస్తున్నారు. క్లైమాక్స్ సీన్‌కి ప్రతి ఒక్కరూ కన్నీళ్లు పెట్టుకుంటున్నారు. సుమన్ బాబు గారు వన్ మాన్ షో లాగా అన్నీ తానే అయి ఇంత మంచి సినిమా తీశారు. నేను ఇందులో రెండు క్యారెక్టర్స్ చేశాను. అందులో పార్వతి పాత్రను బాగా ఎంజాయ్ చేశా. భర్త ప్రేమ కంటే కుమార్తెపై తల్లి ప్రేమ గొప్పదని చెప్పే ఈ చిత్రాన్ని ఇంకా చూడని వాళ్లు ఎవరైనా ఉంటే వెంటనే థియేటర్లకు వెళ్లి చూడండి." అన్నారు.

దర్శకుడు, నటుడు, నిర్మాత సుమన్ బాబు మాట్లాడుతూ.. "నా సినిమా ప్రమోషన్స్‌కి వచ్చి నన్ను ఎంతగానో సపోర్ట్ చేసిన సినీ ప్రముఖులందరికి పేరు పేరున థాంక్స్. సినిమా ఇంత బాగా రావడానికి కారణం అయిన నా సినిమా టీమ్ అందరికీ కృతజ్ఞతలు. సినిమాను అన్ని థియేటర్స్‌లో ప్రేక్షకులు బాగా ఎంజాయ్ చేస్తున్నారు. నేను ఓ థియేటర్‌కి వెళ్లి చూస్తే ఆడియన్స్ డాన్స్‌లు చేస్తున్నారు. 250కిపైగా థియేటర్స్‌లో మా ఎర్ర చీర సినిమా విజయవంతంగా ఆడుతోంది. ప్రతి ఒక్కరూ థియేటర్‌లోనే సినిమా చూసి ఆ ఫీల్‌ను ఎంజాయ్ చేయండి. మరో మూడు నెలల్లో ఇంకో సినిమాతో మీ ముందుకు రాబోతున్నా. డిస్ట్రిబ్యూటర్స్ అందరికీ థాంక్స్ చెబుతున్నా. ఎర్ర చీర కన్నడ వెర్షన్ మార్చి 19న విడుదల చేయాలని ప్లాన్ చేస్తున్నా. ఇక నుంచి గ్యాప్ తీసుకోను. ప్రతి 6 నెలలకు ఒక సినిమాతో ప్రేక్షకుల ముందుకు వస్తా. కంటెంట్ ఉన్న సినిమా తీస్తే తప్పకుండా ఆదరిస్తారని నిరూపించి ఎర్రచీరను ఘన విజయం చేసిన ప్రేక్షక దేవుళ్లందరికీ కృతజ్ఞతలు. సినిమా క్లైమాక్స్ పరమశివుడిపై ఉంది కాబట్టి.. సెకెండ్ వీక్‌లో శివ రాత్రి సందర్భంగా మరిన్ని థియేటర్లు పెంచుతాం. వంద థియేటర్లకు పైగా పెంచి శివరాత్రి సెలబ్రేషన్స్‌ను ఎర్రచీర సినిమా చూస్తూ ప్రేక్షకులు జరుపుకునేలా చేస్తాం. అందరూ తప్పకుండా థియేటర్లలో ఎర్రచీర సినిమా చూసి బిగ్ స్క్రీన్‌పై ఆ పరమశివుడి దర్శనం చేసుకుని ఆ దేవదేవుడి కృపకు పాత్రులు కావాలని కోరుతున్నా" అన్నారు.

ప్రెస్‌మీట్ అనంతరం హీరోయిన్ కారుణ్య చౌదరి పుట్టినరోజు సందర్భంగా మూవీ టీమ్ ఘనంగా ఆమె బర్త్‌డేను సెలబ్రేట్ చేసింది. కేక్ కట్ చేసి పుట్టినరోజు వేడుకను నిర్వహించారు. కారుణ్య చౌదరికి సుమన్ బాబు కేక్ తినిపించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. తన నెక్స్ట్ మూవీలో కూడా ఓ ఇంపార్టెంట్ క్యారెక్టర్‌కు కారుణ్యను అనుకుంటున్నట్లు చెప్పారు. స్క్రిప్ట్ ఫైనల్ అయ్యాక వివరాలను ప్రకటిస్తానని చెప్పారు. ప్రతి ఆర్టిస్ట్‌ను ఎంతో కేరింగ్‌గా చూసుకునే సుమన్ బాబు లాంటి డైరెక్టర్‌తో కలిసి పని చేయడం తన అదృష్టమని కారుణ్య ఈ సందర్భంగా వెల్లడించారు.

త్వరలో థియేటర్స్ లో సుమంత్ మహేంద్రగిరి వారాహి !!!

రాజశ్యామల బ్యానర్‌పై సుమంత్ హీరోగా సంతోష్ జాగర్లపూడి దర్శకత్వంలో మధు కాలిపు నిర్మాతగా తెరకెక్కుతున్న చిత్రం మహేంద్రగిరి వారాహి.

మహేంద్రగిరిలో కొలువుదీరిన వారాహి అమ్మవారి ఆలయం చుట్టూ తిరిగే కథాంశాన్ని ఆధారంగా చేసుకుని దర్శకుడు సంతోష్ జాగర్లపూడి ఈ సినిమాను రూపొందిస్తున్నారు.

హీరో సుమంత్ పుట్టినరోజు సందర్భంగా చిత్ర యూనిట్ గ్లిమ్స్ మరియు కొత్త పోస్టర్ ను విడుదల చేశారు, డైనమిక్ గా ఉన్న సుమంత్ లుక్ కు సోషల్ మీడియాలో సూపర్బ్ రెస్పాన్స్ లభిస్తోంది. ఈ సినిమాలో రెండు ముఖ్య పాత్రల్లో ప్రముఖ హీరో, హీరోయిన్ నటిస్తున్నారు, వాటి వివరాలు త్వరలోనే చిత్ర యూనిట్ ప్రకటించబోతున్నారు.

సుమంత్ , మీనాక్షి గోసామి, బ్రహ్మానందం, వెన్నెల కిషోర్, రాజీవ్ కనకాల, కమల్ కామరాజు, సత్యసాయి శ్రీనివాస్, వంశీ చాగంటి, మంజు భార్గవి తదితరులు నటిస్తున్న ఈ సినిమాకు అనూప్ రూబెన్స్ సంగీతం అందిస్తున్నారు. ఈ సినిమాకు కథ మురళి.

సుమంత్ కు తన కెరీర్ లో మహేంద్రగిరి వారాహి సినిమా ఒక మైలు రాయిగా నిలిచిపోయే సినిమా అవుతుందని, సుమంత్ పాత్ర అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించే విధంగా ఉంటుందని దర్శకుడు సంతోష్ జాగర్లపూడి అన్నారు.

సోషియో ఫాంటసీ నేపథ్యంలో సూపర్ న్యాచురల్ కథతో వస్తోన్న మహేంద్ర గిరి వారాహి సినిమా కోసం ఒక విభిన్నమైన, సరికొత్త పాత్రను హీరో సుమంత్ కోసం దర్శకుడు సంతోష్ జాగర్లపూడి డిజైన్ చేశారని నిర్మాత మధు కాలిపు అన్నారు.

'విప్లవ వీరుడు' మూవీ షూటింగ్ ప్రారంభం

- ఫిలింనగర్‌లో ఘనంగా పూజా కార్యక్రమాలు
- కీలక పాత్రలో ప్రముఖ నటి ఇంద్రజ

హైదరాబాద్:

భారత స్వాతంత్ర సంగ్రామంలో సామాన్యులే వీరులై పోరాడిన చరిత్రను తెరకెక్కిస్తున్న మూవీ 'విప్లవ వీరుడు'. ప్రముఖ నటి ఇంద్రజ కీలక పాత్రలో జైశ్వర్ సోనాలి జంటగా ఎస్ నాగరాజ్ రావు దర్శకత్వంలో ఏవీ జయరాం నిర్మిస్తున్న ఈ సినిమా ఫిలింనగర్ దైవ సన్నిధానంలో పూజా కార్యక్రమాలతో షూటింగ్ ప్రారంభించుకుంది. ముహూర్తం షాట్ కు ప్రముఖ రచయిత పరుచూరి గోపాలకృష్ణ ఇంద్రజపై క్లాప్ కొట్టి సినిమా షూటింగ్‌ను ప్రారంభించారు.

ఈ చిత్రంలో కీలక పాత్ర పోషిస్తున్న ఇంద్రజ మాట్లాడుతూ,

"స్వాతంత్ర కాలం నాటి కథను చాలా సహజంగా తెరకెక్కిస్తున్నారు. సామాన్య ప్రజలు కూడా స్వాతంత్ర పోరాటంలో ఎలా పాల్గొన్నారు అనే అంశాన్ని ఈ సినిమాలో చూపించబోతున్నాం. ఒక సామాన్యుడు విప్లవ వీరుడిగా మారి స్వతంత్ర ఉద్యమంలో విరోచితంగా పోరాడే కథ ఇది. ఈ చిత్రంలో నేను రాణి భవానిదేవి పాత్రలో కనిపించబోతున్నాను. బ్రిటిష్ వారిని ఎలా ఎదుర్కొన్నామన్నదే కథాంశం. అర్థవంతమైన కథతో నిర్మాత జయరాం మంచి సినిమా నిర్మిస్తున్నారు. మీ అందరి ఆశీర్వాదాలు కావాలి." అని అన్నారు.

హీరో జైశ్వర్ మాట్లాడుతూ,

"విప్లవ వీరుడు పాత్రలో ప్రేక్షకుల ముందుకు రానున్నాను. ఈ పాత్ర నాకు ఎంతో ప్రత్యేకం. సినిమా చరిత్రలో నిలిచిపోతుంది." అని చెప్పారు.

హీరోయిన్ సోనాలి మాట్లాడుతూ,

"నాకు ఇంత అద్భుతమైన అవకాశం ఇచ్చినందుకు ఎంతో కృతజ్ఞతలు. ఇది నా మొదటి సినిమా. మీ అందరి ఆశీర్వాదం కావాలి" అని అన్నారు.

దర్శకుడు ఎస్ నాగరాజు రావు మాట్లాడుతూ,

"ఇది నా డ్రీమ్ ప్రాజెక్ట్. బ్రిటిష్ కాలం నాటి హిస్టారికల్ కథతో ఈ సినిమాను తెరకెక్కిస్తున్నాం. ఇందులో ఇంద్రజ గారు కీలకమైన పాత్రలో నటిస్తున్నారు" అని తెలిపారు.

నిర్మాత ఏవీ జయరాం మాట్లాడుతూ,

"టిప్పు సుల్తాన్ కాలం నాటి కథ ఇది. బ్రిటిష్ వారు వ్యాపారం పేరుతో దేశాన్ని ఎలా దోచుకున్నారో, ఆ పరిణామాలను ఈ సినిమాలో చూపిస్తున్నాం. మంచి సందేశం ఇచ్చే సినిమా అవుతుంది" అని చెప్పారు.

నటుడు పటేల్ అశోక్ రెడ్డి మాట్లాడుతూ,

"మనమిప్పుడు స్వేచ్ఛగా జీవిస్తున్నామంటే ఆనాటి పోరాట యోధుల త్యాగాలే కారణం. అలాంటి మహనీయులను తెరపై చూపించే సినిమా ఇది" అని అన్నారు.

బ్యానర్: AVJR ప్రొడక్షన్స్
నటీనటులు: ఇంద్రజ, జైశ్వర్, సోనాలి శెట్టి, Co artistes. Indraja. Kishore. Raghini prajwal, తదితరులు.
నిర్మాత: ఏవీ జయరాం
దర్శకుడు: ఎస్ నాగరాజ్ రావు
టెక్నికల్ డైరెక్టర్, DOP: మాత్యు రాజన్
మ్యూజిక్: ఉదయ్
ఎడిటర్: MNR, PRO: అశోక్ దయ్యాల

Printed, Published and Owned by SITARALLA SRIRAMULU and Printed at M/s SRI DIVYA PRINTERS, Plot No. 33 & 34, 2nd Floor, Vasthu Colony, LB Nagar, Ranga Reddy, Telangana - 500074 and Published at H.No. 10-1-101/10. Bhagya Nagar Colony, Lingojiguda, Saroornagar, Ranga Reddy, Telangana - 500035. EDITOR: SITARALLA SRIRAMULU , RNI. No. TELTEL/2015/62524. Cell: 9966443465